మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 30 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada

గురువారం 04 ఏప్రిల్ 2024

## తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి

### ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ప్రమాదంపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..



హైదరాబాద్,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ సమీపంలోని ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సమీక్షించారు.రియాక్టర్ పేలడంతో మంటలు చెలరేగినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తక్షణమే సహాయక చర్యలు వేగవంతం చేసి, మంటలు అదుపులోకి తీసుకురావాలని అగ్నిమాపక శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందజేయాలని ముఖ్యమంత్రి జిల్లా అధికారు లకు సూచించారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు.



# సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం

**ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలి మంటలు - మేనేజర్ రవి సహా మరో ఆరుగురు మృత్యువాత**

**సహాయక చర్యలు ముమ్మరం...రంగంలోకి దిగిన ఫైరింజన్లు**

సంగారెడ్డి,ఏప్రిల్ 3 (ప్రజామంటలు ): జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. హత్నూర మండలం చందాపూర్ వద్ద ఉన్న ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం రియాక్టర్ పేలి మంటలు భారీగా వ్యాపించాయి. ఈ అగ్ని ప్రమాదంలో పరిశ్రమ డైరెక్టర్ రవితో పాటు మరో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంట లార్పేందుకు ప్రయత్నిస్తున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఫ్యాక్టరీలో ఉన్న కార్మికులను బయటకు తీసుకురావడానికి

మిగతా 2లో..

# బిజేపిలో చేరిన 25 మంది ప్రతిపక్ష అవినీతి నాయకులపై చర్యలు

## – కోల్డ్ స్టోరేజ్ లో కేసులు



హైదరాబాద్ ఏప్రిల్ 03 (ప్రజామంటలు ప్రత్యేక ప్రతినిధి) : అవినీతిని ఏ కోశాన అంగీకరించమని బల్లగుద్దీ చెపుతున్న బిజేపి పార్టీ అధినాయకత్వం, దేశంలోని ఏ స్థాయిలో అవినీతి చేసినా, బిజేపిలో చేరితే గంగా స్నానం చేసి పవిత్రం అయినట్లుగా కడిగిన ముత్యంలా నీతిమంతులుగా బయట పడవచ్చని, గత పదేళ్ళలో ఆ పార్టీ అవినీతి నాయకులను ఇతర పార్టీల నుండి తమలో చేర్చుకొని, పక్షాళణ చేస్తున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఇవన్నీ నిజమానే రీతిలో ప్రతిపక్షాలలో ఉండగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు, బిజేపిలో చేరి ఎలాంటి కేసులు లేకుండా హుందాగా బయట తిరుగున్నట్లు ది ఇండియాయం ఎక్స్ప్రెస్ లో దీప్తిమాన్ తివారీ, తన కథనంలో వెల్లడవుతుంది.

ఆ పత్రిక ప్రచురించిన కథనం లో, 2014 నుండి, అవినీతి విచారణను ఎదుర్కొం టున్న 25 మంది ప్రతిపక్ష నాయకులు బిజెపిలో చేరారు, వారిలో 23 మందికి ఉపశమనం లభించిందని పేర్కొంది. 3 కేసులు మూసివేయబడ్డాయి, 20 నిలిచిపోయాయిబీ విచారణ తెరిచి ఉందని, అవసరమైతే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారని దీప్తిమాన్ తివారీ రాశారు. సువేందు అధికారి, అజిత్ పవార్, అర్చన పాటిల్, అశోక్ చవాన్, హిమంత బిస్వా శర్మ మరియు భావన గవాలీ లాంటి అనేక మందిపై కేసుల అతిగతి తెలియదు. చట్టం దాని స్వంత మార్గాన్ని

మిగతా 2లో..

## రేవంత్‌పై అవాకులు చవాకులు మానాలి

**ఫోన్ ట్యాపింగ్‌లో చట్ట ప్రకారమే చర్యలు**

**ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతాం**

**మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ**

వార్తా 7లో..



## చట్టవిరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల ప్రొఫైల్స్



**-నిఘా పెట్టేందుకు కుట్రపన్ని నిందితులు**

**- రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి**

**-ప్రణీత్ రావు బెయిల్ విచారణ 8కి వాయిదా**

హైదరాబాద్,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): ప్రైవేటు వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టేందుకే నిందితులంతా కూడబలుక్కొని కుట్ర పన్నారని పంజాగుట్ట పోలీసులు న్యాయ స్థానానికి నివేదించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రణీత్‌రావుతో కలిసి భుజంగరావు, తిరుపతన్నలు చట్టవిరుద్ధంగా ప్రైవేటు వ్యక్తుల ప్రొఫైల్స్ రూపొందించారని, ఇది అధికార దుర్వినియోగం కిందికే వస్తుందన్నారు. తర్వాత ఆధారాలు మాయం చేయడంతో పాటు హార్డ్‌డిస్కుల వంటి

మిగతా 2లో..

## జమ్ముకశ్మీర్‌లో ఇండియా విచ్ఛిన్నం

### పీడీపీ, ఎన్‌సీ విడివిడిగా పోటీ



శ్రీనగర్, ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): జమ్ముకశ్మీర్‌లో ఇండియా కూటమి విచ్ఛిన్నమైంది. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నట్టు కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ బుధవారం ప్రకటించారు. కశ్మీర్‌లో ఉన్న మూడు లోక్‌సభ స్థానాల్లోనూ తాము పోటీ చేస్తామని కూటమిలోని మరో భాగస్వామిపక్షం నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ప్రకటించిన క్రమంలో ముఫ్తీ కూడా తాము సొంతంగానే బరిలో దిగుతామని స్పష్టం చేశారు. ఒమర్ అబ్దుల్లా ప్రకటన తమను తీవ్రంగా నిరాశ పరిచిందని ముఫ్తీ పేర్కొన్నారు. వీరిద్దరి ప్రకటనలో కశ్మీర్ లోయలో ఇండియా కూటమి విచ్ఛిన్నమైనట్టే భావించవచ్చు.

## వయనాడ్‌లో రాహుల్ నామినేషన్

**తిరువనంతపురంలో నామినేషన్ వేసిన శశిథరూర్**

**ప్రజాస్వామ్య పరిరిణలో కలసి రావాలని రాహుల్ పిలుపు**

**వయనాడ్ సమస్యలపై పోరాడుతూనే ఉంటానని హామీ**



తిరువనంతపురం, ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి బుధవారంనాడు నామినేషన్ వేశారు. అలాగే తిరువనంతపురం నుంచి కాంగ్రెస్ ప్రస్తుత ఎంపి శశిథరూర్ కూడా నామినేషన్ వేశారు. ప్రస్తుతం వయనాడ్ ఎంపీగా ఉన్న రాహుల్ తిరిగి ఇదే నియోజవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగారు. నామినేషన్ సందర్భంగా ఆయన సోదరి, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. వయనాడ్ నుంచి సీపీఐ అభ్యర్థిగా అన్నే రాజా, బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్ పోటీ చేస్తున్నారు. అంతకుముందు వయనడా÷−÷−లో రాహుల్ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ జరిగేంత వరకూ తాను, 'ఇండియా' కూటమి సభ్యులంతా అవిశ్రాంత పోరాటం సాగిస్తామని రాహుల్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. భరతమాత వాణిని అణిచివేసే విద్వేష, అవినీతి, అన్యాయ శక్తులపై జరుపుతున్న పోరాటం ఈ ఎన్నికలని అన్నారు. నామినేషన్ వేయడానికి ముందు వయనాడ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం జరిపే పోరాటం ఈ ఎన్నికలని అన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై, రాజ్యాంగంపై దాడి జరుపుతున్న శక్తులెవరో ప్రజలందరికీ తెలుసునని బీజేపీపై విమర్శలు గుప్పించారు. హ్యూమన్–యానిమల్ కాన్‌ఫ్లిక్ట్‌తో సహా వయనాడ్ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, వయనాడ్ సమస్యలను ఇప్పటికే దేశం, ప్రపంచం దృష్టికి తెచ్చానని అన్నారు. మెడికల్ కాలేజీకి సంబంధించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని, సీఎంకు లేఖలు సైతం రాశానని చెప్పారు. అయితే, దురదృష్టవశాత్తూ ఆ సమస్య

మిగతా 2లో..




## కేజ్రీవాల్ అరెస్ట్‌పై ఢిల్లీ హైకోర్టులో వాదనలు

### తీర్పును నేడు ప్రకటించనున్న ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): దిల్లీ మద్యం కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఈడీ అరెస్టు చేసింది. దీనిని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వ్యాజ్యాన్ని విచారించిన అనంతరం జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించారు. రాబోయే ఎన్నికల్లో మొదటి ఓటు వేయకముందే ఆప్ పార్టీని కూల్చివేసేందుకు

మిగతా 2లో..

## ప్రజా నాడి




## ఫోన్ ట్యాపింగ్ కాదు..వాటర్ ట్యాప్‌పై దృష్టి

**తెలంగాణ వ్యాప్తంగా రోడ్డెక్కుతున్న మహిళలు**

**మంచినీటి బిందెలతో నిరసనలు**

**గొంతెడుతున్నా పట్టించుకోని కాంగ్రెస్**

**మిషన్ భగీరథ నిర్వహించడం చేతకావడం లేదు**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు**



హైదరాబాద్,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): తెలంగాణలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో గొంతు ఎండి మంచినీళ్లు మహాప్రభో అని అంటున్నారని, చుక్క నీటికోసం అల్లాడుతున్నారని చెప్పారు. మహిళలు బిందెలు పట్టుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నీటికోసం అల్లాడాల్సిన పరిస్థితి తలెత్తలేదని వెల్లడించారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, వివేకానందతో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తాగునీళ్లు లేక ప్రజలు, సాగునీళ్లందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇది ప్రకృతి ప్రకోపం వల్ల వచ్చిన కరువు కాదని, అసమర్థ కాంగ్రెస్ వల్ల వచ్చిన కరువని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీళ్లు ఉన్నా వినియోగించడం

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల టామ్ అండ్ జెర్రీ గేమ్

**మండిపడ్డ బిజెపి ఎంపి లక్ష్మణ్**

**ఫోన్ ట్యాపింగ్ సిబిఐకి అప్పగించాలని డిమాండ్**



హైదరాబాద్,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీలు టామ్ అండ్ జర్రీలా నాటకీయంగా కొట్లాడుతున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఈ విధంగా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. నరేంద్రమోదీ 10 ఏండ్ల పాలన అభివృద్ధిపై చర్చ లేకుండా కుట్రలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం, ధరణి, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ లాంటి పతాక శీర్షికలో వచ్చేలా రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 2014 నుంచి 2023 వరకు ప్రైవేట్ వ్యక్తులు, రాజకీయ నాయకులు ఫోన్స్ ట్యాప్ చేయడం

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# చట్టవిరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల ప్రొఫైల్స్

## నిఘా పెట్టేందుకు కుట్రపన్ని నిందితులు - రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి



ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, అందుకే నిందితులను అరెస్టు చేశామని విన్నవించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో గత నెల 23న భుజంగరావు, తిరుపతన్నలను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మర్నాడు న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. ప్రణీత్‌రావుతో కలిసి వీరిద్దరూ ప్రైవేటు వ్యక్తులపై నిఘా పెట్టినట్లు అంగీకరించారని అందులో పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు 4న నాగోల్‌లోని మూసీ వంతెన వద్ద హార్డ్‌డిస్కులను నదిలో వేసినట్లు ఈ కేసులో తొలుత అరెస్టయిన ప్రణీత్‌రావు మార్చి 21న అంగీకరించాడని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఆయన చెప్పిన చోట వెతికి పదుల సంఖ్యలో ధ్వంసమైన హార్డ్‌డిస్కులు ఉన్నాయి. నీటి అడుగు నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. మార్చి 22న ప్రణీత్‌రావును స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కార్యాలయానికి తీసుకెళ్లామని అక్కడ 12 ఆల్‌ఇన్‌వన్ సిస్టమ్స్, ఏడు సీపీయూలు, ఒక ల్యాప్‌టాప్, ఒక మానిటర్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. హార్డ్‌డిస్కులను కత్తిరించినప్పుడు తెల్లటి అల్యూమినియం పొడి పడిందని దాన్ని ఎలక్ట్రీషియన్ గదిలో గుర్తించి సేకరించినట్లు వివరించారు. ఎస్ఐబీ కార్యాలయం వెనక కొన్ని దస్త్రాలు దహనం చేసినట్లు ఆయన చెప్పగా అక్కడ కాలిపోగా మిగిలిన స్పైరల్ బైండింగ్ పుస్తకం, కొన్ని ధ్రువపత్రాలతోపాటు సీసీ టీవీ దృశ్యాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పొందుపరిచారు. ఎస్ఐబీలో పనిచేస్తున్న కొత్త నరేష్‌గౌడ్ అనే ఉద్యోగిని విచారించినప్పుడు తోటి సిబ్బందితో కలిసి ఎన్నికలప్పుడు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, వారి అనుచరుల డబ్బు రవాణాపై నిఘా పెట్టి దాన్ని పోలీసులు స్వాధీనం చేసుకునేలా చూశామని అంగీకరించినట్లు రిమాండు రిపోర్టులో తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సస్పెండైన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నల ఐదు రోజుల పోలీసు కస్టడీ మంగళవారం ముగిసింది. దాంతో వారిద్దరికీ వైద్య పరీక్షలు నిర్వహించి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో గత నెల 23న వీరిద్దర్నీ పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తదుపరి దర్యాప్తులో భాగంగా న్యాయస్థానం అనుమతితో 5 రోజుల విచారణకు అదుపులోకి తీసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో వీరి పాత్రపై ఆరా తీశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఫోన్ ట్యాపింగ్‌లో భుజంగరావు కీలకపాత్ర పోషించగా, డబ్బు తరలింపులో తిరుపతన్న ప్రమేయం ఉందని.. ఇదే విషయాన్ని వీరిద్దరూ అంగీకరించినట్లు తెలుస్తోంది.

### ప్రణీత్ రావు బెయిల్ విచారణ 8కి వాయిదా

విచారణలో ప్రధానంగా ఎవరి ప్రోద్బలంతో ట్యాపింగ్ చేయాల్సి వచ్చింది, ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేశారు, ఆ సమాచారాన్ని ఎవరికి చేరవేశారు అన్న వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. అలాగే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు డబ్బు చేరవేతలోనూ వీరు చురుగ్గా పాల్గొన్నట్లు దర్యాప్తులో వెల్లడి అయ్యింది.

ప్రణీత్ రావు బెయిల్ విచారణ 8కి వాయిదా

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ టాపింగ్ కేసులో ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్ పై నాంపల్లి కోర్టు విచారణ జరిపింది. ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్ పై పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. అయితే కౌంటర్ పై ఏప్రిల్ 8 వాదనలు వింటామని తదుపరి విచారణను వాయిదా వేసింది. మరో వైపు ఇదే కేసులో రిటైర్డ్ ఏఎస్పీ వేణుగోపాల్‌రావును పోలీసులు విచారిస్తున్నారు. బంజారాహిల్స్ స్టేషన్ లో డీసీపీ విజయ్ కుమార్ ,జూబ్లీహిల్స్ ఏసీపీ ఆధ్వర్యంలో విచారణ జరుపు తున్నారు. వేణుగోపాల్ రావును విచారించిన తర్వాత ఈ కేసులో అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలాగే భుజంగరావు, తిరుపతన్నలు ఏప్రిల్ 6 వరకు జ్యూడిషియల్ రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీళ్లిద్దరు చంచల్ గూడ జైలులో ఉన్నారు. వేణుగోపాల్ రావు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి పదవీ విరమణ పొందారు. అనంతరం వేణుగోపాల్ రావును ఎస్ఐబీలో అడిషనల్ ఎస్పీ(ఓఎస్డీ)గా అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు నియమించారు. ప్రణీత్‌రావు, రాధాకిషన్ రావుతో కలిసి వేణుగోపాల్‌రావు కూడా ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసు

### రాధాకిషన్ రావుకు ఏడు రోజుల పోలీస్ కస్టడీ

హైదరాబాద్,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును ఏడు రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గురువారం 4వ తేదీ నుంచి ఈనెల 10వ తేదీ వరకు పంజాగుట్ట పోలీసులు కస్టడీకి తీసుకొని విచారించనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును ఏడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన్ను ఏ4గా చేర్చారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఆదేశాలతో భవ్య సిమెంట్ యజమాని ఆనంద్ ప్రసాద్ నుంచి రూ.70 లక్షలు సీజ్ చేసినట్లు రాధాకిషన్‌రావు విచారణలో వెల్లడించారు. దుబ్బాక ఉప ఎన్నిక సందర్భంగా రఘునందన్‌రావు, ఆయన బంధువుల నుంచి రూ.కోటి సీజ్ చేశామని అంగీకరించారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి చెందిన రూ.3.50 కోట్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. 2016లో ఓ వర్గానికి చెందిన అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు.

# బిజేపిలో చేరిన 25 మంది ప్రతిపక్ష అవినీతి నాయకులపై చర్యలు లేవు

తీసుకుంటుందని అందరూ చెపుతారు కానీ, అది రాజకీయాలచే నడిస్తే తప్ప నడవలేని పరిస్థితలో ఉందనిపిస్తుంది.

2014 నుండి, అవినీతి ఆరోపణలపై కేంద్ర ఏజెన్సీల నుండి చర్యలు ఎదుర్కొంటున్న 25 మంది ప్రముఖ రాజకీయ నాయకులు బిజెపిలో చేరారు. వారు పార్టీ శ్రేణులను అద్దుకున్నారు: 10 మంది కాంగ్రెస్‌కు చెందినవారుబీ ఎన్ సి పి మరియు శివసేన నుండి నలుగురుబీ టీఎంసీ నుంచి మూడుబీ టీడీపీ నుంచి ఇద్దరుబీ మరియు ఎస్ పి మరియు వి ఎస్ ఆర్ సి పి నుండి ఒక్కొక్కరు బిజెపిలో చేరారు. వీటిలో 23 కేసుల్లో, వారి రాజకీయ ఎత్తుగడ ఉపశమనానికి దారితీసిందని ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దర్యాప్తులో తేలినట్లు పేర్కొన్నారు.

**మూడు కేసులు మూసివేయబడ్డాయి**

మరో 20 మంది నిలిచిపోయారు లేదా కోల్డ్ స్టోరేజీలో ఉన్నాయి. అధికారంలో ఉన్న బిజెపి నాయకత్వం వేసిన స్విచ్ తర్వాత దర్యాప్తు సంస్థ చర్య ||ఉ తీసు కొన్నట్లుగా అనుమానిస్తున్నారు. విచారణ సంస్థల చర్యలు, వాస్తవానికి, నిష్క్రి యాత్మకంగా ఉన్నట్లుగా కనబడుతుంది. ఈ జాబితాలో ఉన్న ఆరుగురు రాజకీయ నాయకులు సార్వత్రిక ఎన్నికలకు వారాల ముందు ఈ ఏడాది మాత్రమే బీజేపీలోకి వెళ్లారు.

దీప్తిమాన్ తివారీ ఇంకా తన కథనంలో ఇలా పేర్కొన్నారు. నిందితుడు ప్రతిపక్షం లో ఉన్నప్పుడు ఏమి జరుగుతుందో దానికి పూర్తి విరుద్ధంగా,, బిజెపిలో చేరిన తరువాత జరుగుతుంది. 2022లో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చేసిన దర్యాప్తులో 95 శాతం మంది ప్రముఖ రాజకీయ నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరియు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ఎలా చర్యలు తీసుకున్నారో వెల్లడైంది. 2014 తర్వాత ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షంలో ఉన్నారు. ప్రతిపక్షం దీనిని "వాషింగ్ మెషీన్" అని పిలుస్తుంది, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ కీయ నాయకులు తమ పార్టీని విడిచిపెట్టి, బిజెపిలో చేరితే చట్టపరమైన పరిణామా లను ఎదుర్కోవాల్సిన అవసరం లేదు.

**ఇది కొత్తది కాదు - ఇది అపూర్వమైన స్థాయి..**

2009లో, కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ సంవత్సరాలలో, బిఎస్‌పికి చెందిన మాయావతి మరియు ఎస్‌పికి చెందిన ములాయం సింగ్ యాదవ్‌లపై ఇద్దరు నాయకులు అధికార యుపిఎ చేత, కోర్టులో ఉన్నప్పుడు, సిబిఐ అవినీతి కేసులలో సిబిఐ మార్గాన్ని మార్చిందని చూపించే ఫైల్ నోట్స్‌ను ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దర్యాప్తులో వెల్లడించింది. రాష్ట్రంలో 2022 మరియు 2023 రాజకీయ గందరగోళం కారణంగా కేంద్ర చర్యలో ఎక్కువ భాగం మహారాష్ట్రపై కేంద్రీకృతమైందని తాజా పరిశోధనలు చూపిస్తున్నాయి.

2022లో ఏకనాథ్ షిండే వర్గం శివసేన నుంచి విడిపోయి బీజేపీతో కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఒక సంవత్సరం తరువాత, అజిత్ పవార్ వర్గం %వవ%న సి పి నుండి విడిపోయి అధికార %వవ%న ది ఏ సంకీర్ణంలో చేరింది. ఎన్సీపీ వర్గానికి చెందిన ఇద్దరు అగ్రనేతలు అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ ఎదుర్కొంటున్న కేసులు ఆ తర్వాత క్లోజ్ అయినట్లు రికార్డులు చెబుతున్నాయి. మొత్తం మీద, మహారాష్ట్రకు చెందిన 12 మంది ప్రముఖ రాజకీయ నాయకులు 25 మంది జాబితాలో ఉన్నారు, వీరిలో పదకొండు మంది 2022లో లేదా ఆ తర్వాత ఎన్‌సిపి, శివసేన మరియు కాంగ్రెస్‌లకు చెందిన నలుగురితో సహా బిజెపికి మారారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం



తీవ్రంగా శ్రమిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం జరిగింది. హత్నూర మండలం చందాపూర్ వద్ద ఉన్న ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు చెలరేగాయి. ఈ అగ్ని ప్రమాదంలో ఎస్బీ పరిశ్రమలో మేనేజర్ గా చేస్తున్న రవి మృతి చెందినట్లు సమాచారం. ఇప్పటివరకూ ఏడుగురు వ్యక్తులు చనిపోగా, మరో 10 మంది వరకు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మంటలు పక్కనున్న మరో పరిశ్రమకు వ్యాపించాయి. చుట్టుపక్కల వారిని సాధ్యమైనంత త్వరగా అక్కడి నుంచి ఖాళీ చేయిస్తున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని, మృతదేహాలను సంగారెడ్డిలోని ఆసుపత్రికి తరలిస్తున్నారు. అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న సిబ్బంది ఫైరిరజన్లతో అక్కడికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో 50 మంది కంపెనీలోపల ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయి అక్కడ భయానక వాతావరణం కనిపిస్తోంది.

## కేమేట్ సైన్స్ కంపెనీ ప్రతినిధులతో తుమ్మల భేటీ

### సాగులో పురుగమందులపై చర్చలు

హైదరాబాద్,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): కేమేట్ సైన్స్ కంపెనీప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు బుధవారం భేటీ అయ్యారు. వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యం లో వ్యవసాయ రంగం తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సాగులో పురుగు మందులు విధానాలను కంపెనీ ప్రతినిధులు వివరించారు. సంప్రదాయ పద్ధలకు భిన్నంగా శాస్త్రీయ పద్ధతుల్లో సాగు పనులు చేపడితే ఎరువులు, పురుగుల మందుల వ్యయం తప్పి సాగు లాభదాయక మవుతుందని వివరించారు. అనంతరం పునరుత్పాదక వ్యవసాయంపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కాదు..వాటర్ ట్యాప్‌పై దృష్టి



ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. ఫోన్‌ట్యాపింగ్ మీద కాకుండా వాటర్ ట్యాప్ మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. చేరికల కోసం పార్టీ గేట్లు ఎత్తడం కాదు.. రైతుల కోసం ప్రాజెక్టుల గేట్లు ఎత్తండని ముఖ్యమంత్రికి సూచించారు. హైదరాబాద్‌లో నేడు ఎక్కడపడితే అక్కడ వాటర్ ట్యాంకర్లు కనిపిస్తున్నాయన్నారు. నగరంలో ట్యాంకర్ల దందా జోరుగా సాగుతున్నదని విమర్శించారు. మూడు, నాలుగు రెట్లు అధికంగా చెల్లించి వాటర్ ట్యాంక్‌తో నీళ్లు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అందుకే కేసీఆర్ అంటే నీళ్లు, కాంగ్రెస్ అంటే కన్నీళ్లని తాము ఎప్పటినుంచో చెబుతున్నామని గుర్తుచేశారు. మిషన్ భగీరథను సక్రమంగా నిర్వహించడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని చెప్పారు. అబద్దాల పునాదులపైనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ధన వనరులను ఢిల్లీకి తరలిస్తున్న శ్రద్ధ జనవనరులను తరలించడంపై లేదన్నారు. ఇవాళ తాగునీళ్ల కోసం అడుక్కోవాల్సి దుస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. హైదరాబాద్‌లో మళ్లీ ఇన్వర్టర్లు, జనరేటర్లు వచ్చాయన్నారు. కాళేశ్వరంపై నోటికొచ్చినట్లు విషప్రచారం చేశారని, కేసీఆర్ జనగామ, సూర్యాపేట వెళ్లగానే అదే కాళేశ్వరం నుంచి జలాలను విడుదల చేశారని చెప్పారు. కాళేశ్వరం పంపులను ఆన్ చేసి, మేడిగడ్డ మరమ్మతులు చేస్తే రైతులకు ఈ దుస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. హరీశ్ రావు మల్లన్న సాగర్ నీటి కోసం అల్టిమేటం ఇస్తే వెంటనే విడుదల చేశారన్నారు. కాళేశ్వరం నీటిని కొండపోచమ్మ వరకు తీసుకురావచ్చని చెప్పారు. పుష్కలంగా నీళ్లుంటే ట్యాంకర్లు ఎందుకు కొనక్కోవాల్సి వచ్చిందన్నారు. పంటలు పండితే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కాంగ్రెస్ సాగునీళ్లవ్వడం లేదని ఆరోపించారు. నీళ్ల ట్యాంకర్లను ఫ్రీగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ కుట్రతో ప్రజల కనీస అవసరమైన తాగునీళ్లు ఇవ్వకుండా చేశారని విమర్శించారు. బెంగళూరులో నీటి వృథాకు జరిమానా విధించాలని అక్కడి ప్రభుత్వం అంటున్నదని, ఇక్కడ వంద రోజులుగా నీళ్లను ఎత్తిపోయకుండా ఉన్న ఈ ప్రభుత్వంపై ఏం జరిమానా విధించాలని ప్రశ్నించారు. తాము అధికారం నుంచి దిగిపోయేనాటికి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీళ్లున్నాయని చెప్పారు. ప్రజల నుంచి ముక్కు పిండేలా బిల్లులు వసూలు చేయరాదని, ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 218 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి వివరాలు ఈ రోజే ముఖ్యమంత్రికి అందిస్తామన్నారు. ఎలాంటి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అప్రతిష్టపాలు చేసేవారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2011 నుంచి జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఆధారాలు అన్ని బయటపెట్టాలన్నారు. అప్పుడు తెలంగాణ ఉద్యమంలో ఫోన్ ట్యాపింగ్ చేసింది ఇప్పుడున్న అధికారులేనని చెప్పారు. 2011లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆంధ్ర సీఎం, తెలంగాణ ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఇప్పుడున్న కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వయంగా చెప్పారని తెలిపారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఫోన్ ట్యాపింగ్ మీద ఆధారాలు తిస్తే ఎవరి బొక్కలు ఏంటో తెలుస్తాయన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలో చేరి మళ్లీ పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై కచ్చితంగా కోర్టుకు వెళ్లామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్, ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక ఖాయమన్నారు. మందకృష్ణ మాదిగ కూడా ఇదే విషయం మాట్లాడారని చెప్పారు. ప్రతి భారతీయుడు పెరిగిన ముడి చమురు ధరల గురించి ఆలోచించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. క్రూడాయిల్ ధరలు 2014 నుంచి తగ్గాయని.. కానీ మన దేశంలో ఇదే దశాబ్దంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.35, రూ.40 చొప్పున పెరిగాయనిన్నారు. దీనికి ఎవరిని నిందించాలి? నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యత వహించాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

## వయనాడ్‌లో రాహుల్ నామినేషన్

అక్కడ్నించి ముందుకు కదలలేదన్నారు. అటు ఢిల్లీ, ఇటు కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడితే అన్ని సమస్యలు తేలిగ్గా పరిష్కారమవుతాయని సూచించారు.

## కేజ్రీవాల్ అరెస్ట్‌పై ఢిల్లీ హైకోర్టులో వాదనలు

ప్రయత్నిస్తున్నారని వాదించారు. కేజ్రీవాల్ తరపు న్యాయవాది సింఘ్వీ మాట్లాడుతూ ఇది చాలా ముఖ్యమైన కేసు అని కోర్టుకు తెలిపారు. అరెస్టు కారణంగా ఆయన లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేరని చెప్పారు. రాజ్యాంగ విరుద్ధంగా అరెస్టు చేశారని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈడీ తరఫున ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఈ కేసులో డిజిటల్ ఆధారాలను ధ్వంసం చేశారని కోర్టుకు చెప్పారు. లిక్కర్ కేసులో డబ్బుకు సంబంధించి న వ్యవహారాన్ని గుర్తించామని హవాలా ద్వారా వందకోట్ల రూపాయలు ఆప్ పార్టీకి అందాయని చెప్పారు. వాటిని గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారన్నారు. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్ని నిర్ణయాలు ఆయనే తీసుకుంటారని, ఆప్ మీడియా ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ లిక్కర్ కేసులో కీలకపాత్ర వహించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఏప్రిల్ 15 వరకు జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలుకు తరలించారు. ఘటనపై ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల సమయంలో ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకు ఆయనను జైల్లో పెట్టారని ఆరోపించారు. ఈ నియంతృత్వ పాలనకు దేశ ప్రజలు సమాధానం చెబుతారని హెచ్చరించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడమే బీజేపీ, ఈడీల లక్ష్యమనే విషయం అర్థమైందన్న ÷ర్ అయ్యారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల టామ్ అండ్ జెర్రీ గేమ్

రిటైర్ పోలీస్ అధికారి చేసినవన్నారు. దేశ భద్రత, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అంశం ఇది అని పేర్కొన్నారు. 2018, 2019 జరిగిన ఎన్నికలు దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బయటకు వస్తున్నాయన్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పెను దుమారాన్నే రేపుతోంది. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఇప్పటికే మాటల తూటాలు పేలుతున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం కంటే ఈ కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తే మంచిదని బిజెపి సూచిస్తోంది. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడిన ఎంపీ లక్ష్మణ్...' ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లోనే కాకుండా అంతకు ముందు జరిగిన ఉపఎన్నికల్లో కూడా ట్యాపింగ్ జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. అన్నింటిపై సమగ్ర దర్యాప్తు చేయకుండా కావాల్సిన వాళ్లను తప్పించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. నిందితుల అందరిపై ఒకే విధంగా దృష్టి పెట్టడం లేదు. అందుకే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని మేం కోరుతున్నాం. టామ్ అండ్ జెర్రీ మాదిరిగా కొట్టకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్గ ÷ట్‌పై ప్రజలకు నమ్మకం లేదన్నారు. రేవంత్ రెడ్డికి ఈ కేసుపై చిత్త శుద్ధి ఉంటే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ చాలా ఆరోపణలు చేసిందని దేనిపై కూడా ఇంత వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పుడు కూడా ఎన్నికల కోసం ఇరుపార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు.

# రేవంత్‌పై అవాకులు చవాకులు మానాలి

హైదరాబాద్,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): ఫోన్ ట్యాపింగ్ అంశం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఫోట్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా ఈ అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకి వస్తారన్నారు. అందరి ఫోన్‌లు ట్యాప్ చేశారని.. విచారణలో అన్నీ బయటకు వస్తాయని తెలిపారు. కేటీఆర్ నోటీసులు ఇచ్చుకుంటే ఇచ్చుకో అని అన్నారు. తాము పద్దతి ప్రకారం పనిచేస్తామన్నారు. మిషన్ భగీరథ తప్పుడు స్కీం అని వ్యాఖ్యలు చేశారు. తాము తెచ్చిన వాటర్ మేకానిజం కంటిన్యూ చేయొద్దని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తప్పు అని అన్నారు.



తమ ప్రభుత్వం గురించి కేటీఆర్ రైతులను అడిగితే తెలుస్తుందని.. తాము ఏం చేస్తామో సంవత్సరంలో చేసి చూపిస్తామన్నారు. రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. పూర్తి స్థాయి బడ్జెట్‌లో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి రైతును మోసం చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో నాటి సీఎం, వ్యవసాయ మంత్రికి రైతుల కోసం ఎన్ని విజ్ఞాపనలు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వర్షాలుపడలేదని.. కాంగ్రెస్ పాలనలో కరువు వచ్చిందని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది కోసం బీఆర్ఎస్ హడావిడి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలు చేశారు.

# వందరోజుల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

**ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను వదలబోం**
**బిఆర్ఎస్ గెలిస్తేనే అసెంబ్లీలో పోరాడగలం**
**కాంగ్రెస్‌కు అభ్యర్థులు లేక బిఆర్ఎస్‌కు గాలం**
**కెసిఆర్ రాగానే భయంతో.. కాల్వల్లోకి నీళ్లు వదిలారు**
**భువనగిరి పార్లమెంట్ సమీక్షలో హరీష్ రావు**



యాదాద్రిభువనగిరి, ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరు పడగొట్టరని.. ఆ పార్టీలోని నేతల గ్రూప్ రాజకీయాలే పడగొడతాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. బుధవారం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ... వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మహాలక్ష్మి పేరుతో మహా మోసం చేశారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి 6 గ్యారెంటీలను అమలు చేసేలా పోరాడుతామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రైతులను పరామర్శించడానికి బయలుదేరగానే రేవంత్ భయపడి కాల్వలోకి నీళ్లు వదిలేలా అధికారులను ఆదేశించారని చెప్పారు. కాంగ్రెస్‌కి పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు లేరని.. అందుకనే తమ పార్టీ నుంచి బలవంతంగా చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల తర్వాత కరెంట్ బిల్లు పెంచుతారని...అన్ని రకాల ఛార్జీలు పెరుగుతాయన్నారు. బీజేపీ పాలనలో అన్ని ధరలు పెంచారని ధ్వజమెత్తారు. బీజేపీ నేతలు అయోధ్య రామాలయం కట్టి , అక్షింతలు పంచి రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాముడు అందరికీ దేవుడని బీజేపీ నేతలు గుర్తుంచుకోవాలని చెప్పారు. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నలుగురు అభ్యర్థులు దానం నాగేందర్, కడియం కావ్య, పట్నం సునీత, రంజిత్ రెడ్డి ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానానికే పరిమితమవుతారని అన్నారు. ఈ యాసంగిలో రైతుల ధాన్యాన్ని క్వింట రూ. 2500కు ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉన్నత కాలం బీఆర్ఎస్ ఉంటుందని చెప్పారు. ఈ కష్టకాలంలో తమ పార్టీని వదిలిపెట్టి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఏ నాయకులను వదిలిపెట్టమని.. కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా.. మళ్లీ పార్టీలోకి రానివ్వబోమని హరీష్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ అంటేనే లీకులే, ఫేక్ న్యూస్‌లు. పాలన గాలికొదిలేసి అక్రమ కేసులతో కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు మండిపడ్డారు. ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండమని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ సాకుతో హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాట తప్పిందని ఆరోపించారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తాం అని మోసం చేశారు. కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కార్యకర్తలు కాంగ్రెస్ మోసాలను గ్రామాల్లో విడమర్చి చెప్పాలన్నారు. క్యామ మల్లేష్ మాస్ లీడర్. భువనగిరిలో తప్పకుండా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. స్వయానా రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసి పార్టీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తి భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అని ఎద్దేశా చేశారు. అసెంబ్లీలో కొట్లాడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలువాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టం చేశారు. కార్యకర్తలు అంతా ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలన్నారు.



# మోడీ హయాంలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

**బిఆర్ఎస్ హయాంలోనే కరువు కాలం మొదలు**
**బిఆర్ఎస్‌కు ఒక్కసీటూ రాదన్న మంత్రి ఉత్తమ్**



సూర్యాపేట,ఏప్రిల్3 (ప్రజా మంటలు): ప్రధాని మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని..మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ళ స్వాతంత్ర్యం అనంతరం ఇలా జరగడం ఇదే ప్రథమమని అన్నారు. మరోసారి మోదీ అధికారంలోకి వస్తే దేశం ఇంకా ప్రమాదంలో పడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎంలను జైలుకు పంపుతున్నారని, ప్రతిపక్షాలను దర్యాప్తు సంస్థలతో ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అకౌంట్స్ ఫ్రీజ్ చేసి ఎన్నికల ప్రచార పక్రియకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఇకపోతే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలోనే లేదని... వాళ్లకు సున్నా సీట్లంటూ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ మిగలదన్నారు. వారు ఎంతగా అవినీతికి పాల్పడ్డారో నిత్యం చూస్తూనే ఉన్నామని అన్నారు. 13 -14 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఉనికికి ప్రమాదం వచ్చిందని గుర్తించిన నేతలు కావాలనే కాంగ్రెస్‌పై అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధరకు కొనుగోలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 24 గంటలు సప్లై , డిమాండ్ పెరిగినా విద్యుత్ కోతలు ఉండవన్నారు. కరువు బీఆర్ఎస్ హయాంలోనే మొదలైందన్నారు. జలాశయాల్లో నీళ్లు లేవని 2 జూలై 2023 నే గుర్తించారని.. పదేళ్ళలో మీరు చేయనివి తాము 100 రోజులో చేశామన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై ఫోన్ టాపింగ్ అస్త్రం ఉపయోగించారని విమర్శించారు. ఫోన్ టాప్పింగ్ కి పాల్పడి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎంపిగా గెలిపిస్తే ఢిల్లీలో మన వాణి వినిపిస్తా

**పేదల కోసం అంకితభావంతో పనిచేస్తా**
**బిఆర్ఎస్ నాగర్ కర్నూల్ అభ్యర్థి ఆర్ఎస్‌పి**



నాగర్‌కర్నూల్, ఏప్రిల్3 (ప్రజా మంటలు): ఎంపీగా అవకాశం కల్పిస్తే నాగర్‌కర్నూల్ వాణిని ఢిల్లీలో వినిపిస్తానని, పేద ప్రజల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసి చూపిస్తానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం వనపర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంతకుముందు ఇక్కడి నుంచి ఎన్నికైన ఎంపీలంతా పార్లమెంట్లో మౌనంగా ఉన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలందరికి నష్టం కలుగుతుందన్నారు మల్లురవి, పోతుగంటి భరత్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వెయ్యి గురుకులాలను ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ప్రశ్నించారు. గురుకులాల ద్వారా లక్షలాది మంది పేద విద్యార్థులు ప్రపంచ స్థాయిలో చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ గురుకులాల గురించి అమెరికాలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోనూ పాఠం ఉందంటే అది నాటి సీఎం కేసీఆర్ ప్రత్యేకత అన్నారు. అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దు.. అప్రమత్తంగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే సమస్యలపైన, సమాజం పట్ల పట్టు ఉన్న వ్యక్తి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌నుగెలిపించాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కాంక్షిస్తూ వనపర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు.ఐపీఎస్ అధికారిగా ప్రవీణ్ కుమార్ ప్రజల కోరిక మేరకు పనిచేసి శభాష్ అనిపించుకున్నారు. బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కానీ హామీలే ఇచ్చింది. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన బండారం బయటపడుతుందన్నారు. కేవలం 100 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో అభాసు పాలయిందన్నారు. హామీల అమలు చేయలేక ఎన్నికల కోడ్ అంటూ మంత్రులు తప్పించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రెండు జాతీయ పార్టీలు ఉద్యమ నేత కేసీఆర్ పై దండెత్తుతున్నాయి. కేంద్రంలో అధికారం పేరు చెప్పి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ తప్పించు కునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి, భవిష్యత్ మనదేనని భరోసానిచ్చారు. పదేళ్లలో బీజేపీ పాలనలో రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మోసపోతాం. రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ, రూ.4,000 పెన్షన్, తులం బంగారం ఇవ్వకపోయినా ప్రజలు అంగీకరించారు అంటారు. కాబట్టి, కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టాలి. దీనిపైన ప్రతి గ్రామంలో చర్చ చేయాలన్నారు.

# దేశంలో మోడీ నియంతృత్వాన్ని అడ్డుకుందాం

**వరంగల్ లో కడియం కావ్యకు మద్దతు ఇవ్వండి**
**సీపీఐ నాయకులను కోరిన రేవూరి, కడియం శ్రీహరి**

హనుమకొండ,ఏప్రిల్ 3 (ప్రజా మంటలు): దేశంలో రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ నియంతృత్వ పాలనను కొనసాగించిన నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయానికి విచ్చేసి ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ మద్దతు కోరుతూ సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిశారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత పదేళ్లలో దేశ ఆర్థిక వనరులను కార్పొరేట్, పెట్టు బడి దారులకు దోచి పెట్టడమే పనిగా పెట్టుకున్నారని, హిందూత్వ వాదం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని అన్నారు. తమ మాట వినని వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి సంస్థలను ప్రయోగిస్తూ ప్రశ్నించే గొంతులు లేకుండా చేస్తున్నారని, మరోవైపు దళితులు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని అన్నారు. ఈ క్రమంలోనే దేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలతో సహా ప్రాంతీయ పార్టీలతో కలిసి ఇండియా కూటమిగా ఏర్పడడం జరిగిందన్నారు. ఈ రోజు కూటమి అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి పోటీ చేస్తున్న విద్యావంతురాలు కడియం కావ్యకు మద్దతు కోసం సీపీఐ, సీపీఎం నాయకులను కోరడం జరుగుతున్నదని చెప్పారు. కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులుగా ఎమ్మెల్యే, ఎంపీ, డిప్యూటీ సీఎం గా పని చేశారని, కొందరు స్వార్థ పరులే ఆయనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. మంద క్రిష్ణ లాంటి వ్యక్తి తన వర్గ ప్రయోజనాల కోసం పోరాడకుండా బీజేపీకి ఏజెంట్‌గా మారి మాదిగలకు ద్రోహం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. దళితులు, మైనార్టీలపై దాడులు చేసే బీజేపీకి వంత పాడుతూ మతతత్వ వాదాన్ని పెంచుతున్నాడని అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీ కే పరోక్షంగా మద్దతు తెలుపుతూ కడియం పై విమర్శిస్తున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, కేసీఆర్ పైత్యం వల్లే కాళేశ్వరం రీడిజైనింగ్ జరిగి పనికి రాకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తెలిపారు. బీజేపీ పాలనలో గడిచిన పదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్య ప్రజల జీవితాలపై పెనుభారం మోపారని అన్నారు. తమ ప్రధాన లక్ష్యం బీజేపీ ఓటమే నని బీజేపీకి వంత పాడుతున్న బీఆర్ఎస్ ను కూడా పార్లమెంటు ఎన్నికలలో ఓడిస్తామని అన్నారు. ఇండియా కూటమి అభ్యర్థిగా కడియం కావ్య గెలిస్తేనే విభజన హామీలైన బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే పరిశ్రమలు సాధ్యమని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి,ఎన్. జ్యోతి,మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, నాయకులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, షేక్ బాష్ మియా, పి. సుగుణమ్మ, తోట బిక్షపతి, మ్మదెల ఎల్లేష్, బీఆర్ లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రజలకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్

**-జగిత్యాల డీఎస్పీ రఘు చందర్**





జగిత్యాల ఏప్రిల్ 3 (ప్రజా మంటలు) ప్రతి నెల మొదటి బుధవారం రోజున విద్యార్థులకు ప్రజలకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్ ను నిర్వహించడం లో బాగంగా బుధవారం జగిత్యాల పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ లో, హోటల్ బుకింగ్ స్కాం, పెట్టుబడి మోసం, ఇన్ఫర్మేషన్ స్కాం, సైబర్ క్రైమ్ నేరాల గురించి కాలేజి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించిన జగిత్యాల డీఎస్పీ రఘు చందర్, సీఐ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్,ఈ కార్యక్రమంలో కాలేజి నిర్వాహకులు, విద్యార్థినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భద్రాచలం సీతారాముల వారి దర్శినానికి జగిత్యాల నుంచి అంజనేయస్వామి దీక్ష స్వాముల మహా పాదయాత్ర చేపట్టారు



జగిత్యాల ఏప్రిల్ 3 (ప్రజా మంటలు) జిల్లా కేంద్రంలోని పురాణిపేట్ శ్రీ అంజనేయ స్వామి దేవాలయం నుంచి భద్రాచలం శ్రీ సీతారాముల దర్శినానికి అంజనేయ స్వామి దీక్ష స్వాముల మహా పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు అంజనేయ స్వామి దీక్ష స్వాములు జగిత్యాల పట్టణంలోని శ్రీ అంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం. అలయ నిర్వాహకులు నలమాసు గంగాధర్ అంజనేయ దీక్ష పరులను శాలువాతో సన్మానించారు. అనంతం అంజనేయ దీక్ష పరుల పాదయాత్ర ను హిందూ వాహిని నాయకులు వేముల సంతోష్ జెండా ఊపి ప్రారంభించారు....

# రోహింగ్యాలకు అడ్డాగా తెలంగాణ మైనార్టీల కోసం ఉత్తమ్ వ్యాఖ్యలు

**మండిపడ్డ నిజామాబాద్ ఎంపి అర్వింద్**

నిజామాబాద్,ఏప్రిల్3(ప్రజా మంటలు): రోహింగ్యాలకు తెలంగాణను అడ్డాగా మార్చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అనుకుంటున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కేంద్రం అమలు చేసిన సీఏఏ, ఎన్ఆర్సీ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని ఉత్తమ్ అధికారికంగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. కేవలం మైనార్టీ ఓట్ల కోసం కాంగ్రెస్ నేతలు సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉత్తమ్ వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు రాజ్యాంగాన్ని అవమానించేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బుధవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...తెలంగాణలో ఆర్టికల్ 786 తీసుకువచ్చే యోచనలో ఉన్నారా అని ప్రశ్నించారు. మంత్రి పదవిలో ఉండి ఉత్తమ్ ఈ తరహా వ్యాఖ్యలు ఎలా చేస్తారని నిలదీశారు. సత్వరమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బోధన్‌ను దొంగ పాస్‌పోర్టులకు అడ్డాగా మాజీ సీఎం కేసీఆర్ మార్చారని విరుచుకుపడ్డారు. ఉత్తమ్ గడ్డం పెంచినంత మాత్రాన సెక్యులరిజం కాదని.. అసలైన సెక్యులర్ పార్టీ బీజేపీ మాత్రమేనని ఎంపీ అర్వింద్ అన్నారు.

# ఎన్నికల కోడ్‌తో ఆగిన పథకాలు

**ఎన్నికలయ్యాక ఇందిరమ్మ ఇళ్లు అందచేత**
**పినపాక సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరామ్**

భద్రాద్రి కొత్తగూడెం,ఏప్రిల్3 (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని అందువల్ల కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు కొంత సమయం పడుతుందని మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ అన్నారు. ఎన్నికల కోడ్ అయిపోగానే పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని బలరాం నాయక్ అన్నారు. బుధవారం నాడు మణుగూరులో పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన కాంగ్రెస్ కార్యకర్తలకు పార్లమెంట్ ఎన్నికలపై దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాల్లో ఐదు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ 10 ఏళ్లు అధికారంలో ఉన్న నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. పులుసుబొంత ప్రాజెక్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు పినపాక నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. మళ్లీ తనను ఎంపీగా గెలిపించాలని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. గుండాలలో రెండు బొగ్గుబావులు, ఐటీసీలో చెప్పుల ఫ్యాక్టరీ కోసం కృషి చేస్తానని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని పోరిక బలరాం నాయక్ అన్నారు.

# అవినీతిపై చర్యలకు ఉపక్రమించాలి

విపక్ష బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్ట్‌ల కుంభకోణాలు,అ వినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదను గుర్తించారు. పదేళ్లలో వందేళ్ల విధ్వంసం జరిగిందని సిఎం రేవంత్ కూడా పత్రికా ముఖంగా ప్రకటిస్తున్నారు. అయినా సిగ్గూఎగ్గూ లేకుండా ఎదురుదాడే మంత్రం అన్నట్లుగా బిఆర్ఎస్ నేతల వ్యవహారం ఉంది. నిజానికి ఇంతటి విధ్వంసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా జరగలేదు. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలను పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు. తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్న వేళ సిఎం పదవి కత్తిమీద సాము లాంటిదే. ఈ క్రమంలో అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజా మద్దతు రేవంత్‌కు దక్కుతుంది. ఇప్పటికీ విపక్ష బిఆర్ఎస్ చేస్తున్న గోలను ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ..కెసిఆర్ అవినీతి పాలనను ఎండగడుతూనే ముందుకు సాగాలి. ప్రజాప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి చేయాలి. అలాగే రేవంత్ కూడా త్రివిక్రముడిగా ముందుకు సాగాలి. ఇటు అంతర్గత శత్రువులను, అటు బాహ్య శత్రువులను ఎదుర్కోవాలి. ప్రధానంగా బిఆర్ఎస్, బిజెపిలను కూడా ఎదుర్కొనేలా శక్తి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్ఇనకలు ఇందుకు అతిపెద్ద పరీక్ష పెట్టబోతు న్నాయి. ఎందుకంటే బిఆర్ఎస్, బిజెపి లోపాయకారి ఒప్పందం చేసుకున్నాయని స్వయంగా సిఎం ఆరోపిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణం గా ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చు కోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామీలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. అటు బిజెపిని, ఇటు బిఆర్ఎస్‌ను ఢీకొనే ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ప్రధానంగా కెసిఆర్‌ను ధైర్యంగా విమర్శిస్తూ.. అవినీతి కేసులను బట్టబయలు చేస్తూ ముందుకు సాగడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు ఈ విషయం గుర్తించి మసలుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. జాతీయ పార్టీలో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వహించే అవకాశం రానీయరు. అయినా కెసిఆర్‌ను, బిఆర్ఎస్‌ను ఢీకొని గట్టిగా ఎదురొడ్డి నిలిచేలా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో సత్తా చాటితే రేవంత్ మరింత బలోపేతం అవుతారు. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప మున్ముందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. సహజంగానే బీఆర్ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా ఉంటుంది. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసీఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేకుండా నిరంకుశంగా పదేళ్లు పాలించారు. పదేళ్లలో ఏం చేశారో ఇప్పుడు చూస్తున్నాం. కరువు వచ్చిందంటే కాంగ్రెస్ తెచ్చిందని బుర్రలేని మాటలు మాట్లాడుతున్నారు. ఇది రైతులు కూడా అర్థం చేసుకోగలరు.



కేసీఆర్‌కు హైకమాండ్ అంటూ ఎవరూ లేరు. ఆయనే హైకమాండ్. అందుకే తన మాటే శాసనం అన్న రీతిలో సాగారు. అనేక అవకతవకలను వెలికితీస్తున్న క్రమంలో ఇక్కడే సిఎంగా రేవంత్ కొంత కఠినంగానే ఉండాలి. ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన పనులు లక్ష్యంగానే ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే వేగంగా దూసుకు పోవాలి. ప్రజల్లో పాలనపట్ల నమ్మకం కలిగించాలి. మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. ఈ క్రమంలో బిఆర్ఎస్ అవినీతిని ఎండగడుతూనే ప్రజల సంక్షేమం కోరి ముందుకు సాగాలి. పనుల్లో వేగం పెంచాలి. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తూనే ఇవ్వని అనేకానేక పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే ప్రయత్నాలు చేయాలి. సాగు,తాగునీటి రంగాలను చక్కదిద్దే ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. ఎన్నికలయ్యాక వేగంగా ప్రజల్లో సమస్యలపై పరిష్కారానికి చర్యలకు పూనుకోవాలి. వచ్చే వర్షాకాలం నాటికి నీటి నిల్వలు పెంచడం, సాగునీటి రంగాన్ని ఆధునీక రించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. కెసిఆర్ అండ్ కో చేస్తున్న ఆరోపణలను గట్టిగా తిప్పి కొడుతూనే..వారి అవినీతిపై వేగంగా చర్యలకు ఉపక్రమించాలి. కేవలం ఆరోపణలతో కాలక్షేపం చేస్తే ప్రజలు కూడా నమ్మరు. చేసిన ఆరోపనలను నిరూపించగలగాలి. అప్పుడే ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడుతుంది.

# స్వయంకృతంతో భారాస ప్రజలకు దూరం అవుతుందా ?

**తెలంగాణలో బిజేపి కి ఆశ్రయం ఇస్తుంది ఎవరు ?**

**పరనిందతో తమ ప్రాభవాన్ని పదిలపరుచుకోలేరు**

**వ్యాపార, పారిశ్రామికవేత్తలతో పార్టీలు నిలవవు**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాలలో బాలహీనపడిన చోట సాధారణంగా ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ముఖ్యమగా ఉత్తర భారతంలోని బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ లలో కాగణరెస్ నామ మాత్రం కావడానికి కారణం అక్కడి ప్రాంతీయ నాయకుల, ప్రజల ఆకానసఖ్యలను కాంగ్రెస్ పార్టీ గుర్తించక పోవడమే ప్రధాన కారణం. దక్షిణాన కర్ణాటకలో దేవ గౌడ నాయకత్వంలోని జే ది ఎస్ ఉన్నా, ఐ కర్ణాటకలోని ఒక ప్రాంతానికే పరిమితం కావడంతో, అక్కడ బిజేపి తన స్థానాన్ని పదిల పరుచుకోంది. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా, ప్రాంతీయ పార్టీలులు బలంగా లేవంటే అక్కడ బిజేపి తన ఉనికినిని చాటుకోవాడమే కాకుండా, బలంగా ఎదుగుతుంది. తమిళనాడువ కాంగ్రెస్ 1960–70 దశకంలో కనుమరుగు కాగా, కేరళ లో యునైటెడ్ ఫ్రంట్ లో భాగంగా మిగిలింది. ఇక తెలుగు రాష్ట్రాలలో తెలుగు దేశం పార్టీ ఆవిర్భావంతో కాంగ్రెస్ కు పెద్ద దెబ్బే తగిలింది. కాలనీ బిజేపి తెలుగుదేశం పార్టీతో పెట్టు పెట్టుకోవడంతో, ఇక్కడ అది తోక పార్టీగానే మిగిలిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఇస్తామన్నా, బిజేపిని ఉత్తరాది బనియా పార్టీగా గుర్తింపుఉన్న బిజేపి, తెలుగు వారికి తెలంగాణ ప్రత్యేక ఉద్యమం కొంత చోటు ఇచ్చింది. అప్పటి తెరాస తో పోవటు లేకున్నా, వయమ పక్షయభావాలున్న వారికి, ఆ పార్టీల ప్రభావం ఉన్న ఉత్తర తెలంగాణలో భూస్వాములకు, పెత్తందార్లకు అనుకూలంగా, నక్సలైట్లకు వ్యతిరేకంగా పోరాడి ,ప్రభుత్వానికి అనుకూలంగా ఉండడం వల్ల గ్రామీణ ప్రాంతాలలోకి చొచ్చుక పోయింది. భారస ఉద్యమం తరువాత పక్కా రాజకీయ పార్టీగా మారిపోవడం, కాంగ్రెస్ రాష్ట్రంలో బలహీనపడడం తో ఆ శూన్యాన్ని బిజేపి పూరించే ప్రయత్నం చేస్తుంది. అదీ కాక, కేంద్రంలో అధికారంలో ఉండడంతో, ఆ పార్టీకి ఆర్థిక పరిపుష్టి కలగడం, అధికార యంత్రాంగంపై పట్టు దొరకడంతో, తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో తెలుగు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ, తెలుగు రాష్ట్రాలలో పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తుంది.

**దక్షిణాన ఉనికి పోరాటం చేస్తున్నా బిజేపి ?**

కేంద్రంలో అధికారం ఉండడంతో ఆంధ్ర ప్రాంత కాంట్రాక్టర్ లను ప్రోత్సహించినా, , ఆంధ్ర ప్రాంత ప్రజలలో బిజేపి స్థానం సంపాదించుకోలేకపోయింది. అక్కడా, తెలుగుదేశం పార్టెకి తోక పార్టీలనీ మిగిలిపోయింది. తెలంగాణలో మాత్రం, ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో, ఎక్కడైతే గతంలో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉందో ఆయా ప్రాంతాలలో బిజేపి కొంత పుంజుకొనది. దీనికి ఖమ్మం జిల్లా మినహాయింపుగా చెప్పుకోవాలి. ఖమ్మం జిల్లా మొదటి నుండి వామపక్ష రాజకీయాలకు కేంద్రం అయినా, అక్కడి ప్రజల భావాలు ఆధర ప్రాంత రాజకీయాలకు అనుగుణంగా ఉంటాయి. అక్కడి ప్రజలలో ఆంధ్రప్రాంత వలస నాయకులు ఎక్కువగా ఉండడం, జిల్లా చుట్టూ అంతా ఆంధ్ర ప్రాంతమే కావడంతో, అది మొదటి నుండి మిగతా తెలంగాణ ప్రజల భావాలతో కాకుండా, ఆంధ్ర ప్రాంత ప్రజల మానవ భావాలతో ఎక్కువగా కలిసిమెలిసి ఉంటుంది. అందుకే, తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన రోజుల్లో కూడా, ఖమ్మం జిల్లాలో ఉద్యమ ప్రభావం అంతగా లేదు.

ప్రస్తుత పరిస్థితులలో బిజేపికీ ఊతమిస్తుంది భారాస పార్టీ వైఖరే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొన్నటిదాక స్తంబద్ధంగా ఉన్న కాంగ్రెస్, బి ఆర్ ఎస్ నియంతృత్వ పోకడల వల్ల ప్రజాలకన్నా, పార్టీ కింది స్థాయి నాయకుల కన్నా పెట్టుబడి దారులకు, పారిశ్రామిక వేత్తలకు, రియాలటర్లకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కింది స్థాయి మధ్యతరగతి వతలర్లు ఆ పార్టీకి దూరం అయ్యారు. ఈ అవకాశాన్ని గ్రామాస్తాయిలో ఇంకా కార్యకర్తలు ఉన్న కాంగ్రెస్ సరిగ్గా ఉపయోగించుకొని, బొటాయబోటి మెజారిట తోనైనా, అధికారంలోకి వచ్చింది. డబ్బు సంపాదనే లక్ష్యంగా భారాసలో చేరిన రాజకీయ వ్యాపారవేత్తలు అందరూ అధికారం కోసం, తమ వ్యాపార లావాదేవీల కొనసాగింపు కొరకు మళ్ళీ అధి కార పార్టీ అయిన కాంగ్రెస్ లో చేరుతున్నారు. ఇది వ్యాపారవేత్తల సహజ లక్షణం. వారివారి వ్యాపారాలు ఎలాంటి వొడిదోడుకులు లేకుండా కొనసాగలనే అధికార పార్టీ అండ తప్పని సారి.

**ఇల్లు చక్కబెట్టుకోకుండా ఎదురుదాడితో లాభం ఉంటుందా ?**

అధికారం కోల్పోయిన భారాస పార్టీ ఇప్పటికీ క్షేత్ర స్థాయిలో ఉన్న కార్యకర్తల మోనో భావాలను గ్రహించలేకో. లేదా ఇంకా తమ అహంభావాన్ని విడవలేకో, పార్టీని ప్రక్షాళనం చేసే దిశలో కాకుండా, ఇంకా నాశనం చేసే దిశలో వెళుతున్నారు. కాంగ్రెస్ ను ఎదుర్కోవలంటే ముందు తాము బలంగా ఉండాలని, కనీసం ఊపిరితోనైనా ఉండాలనే వాస్తవాన్ని గ్రహించలేని భారాస, ఇంకా అధికార కాలంనాటి మత్తులోనే ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. అహదీకారం కోల్పోయి నాలుగు నెలలు కావస్తున్నా, పార్టీ ఓటమికి కారణాలను విశ్లేషించు కోవడానికి పూర్తి స్థాయి సమావేశాలు నిర్వహించలేదు. కాంగ్రెస్ పార్టీ ని ఎలా అధికారంలో నుండి దించాలనే ప్రయత్నిస్తుంది తప్ప, క్షేత్ర స్థాయిలో తమను నమముక్కోని ఉన్న అసలైన కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత పార్టీ అధినాయకత్వంధే అనే భావనలో మాత్రం లేరనే విశ్లేషకులు భావిస్తున్నారు.

రాజకీయ అవగాహనతో కాకుండా, తమ వ్యాపార అవగాహనతో, ఆర్థిక లావాదేవిలే ప్రధానంగా ఇన్నాళ్ళూ కొనసాగిన భారాస రాజకీయాలనే ఇంకా కొనసాగించాలనుకోవడం, నాయకుల తీరుపై ఎలాంటి విమర్శలు, సమీక్షలు చేసుకోకుండా, ప్రజల వ్యతిరేకతను కూడగట్టుకొన్న కోటరీ కె ఇంకా పెద్దపీట వేయడంతో, ప్రజా, ధన బలం ఉన్న నాయకఉలు అటు అధికార పార్టీ అయిన కాంగ్రెస్ లోకో, మళ్ళీ కేంద్రంలో అధికారంలోకి వస్తునాదనే నమ్మకంతో బిజేపి లోకి వెళ్లిపోతున్నా, వారిని కట్టడి చేయడంలో భారాస అధినాయకత్వం విఫలం అయింది. ఇన్నాళ్ళూ ఎవరిపై కోపంతో, ద్వేషంతో ఉన్నారో వారినే మళ్ళీ ముందు పెట్టి రాజకీయయాలను నడపాలని చూడదమే భారసా చేస్తున్న పెద్ద తప్పుగా భావిస్తున్నారు.

**బి ఆర్ ఎస్ స్థానంలో బిజేపి ఎవరికి లాభం ?**

కుటుంబ పార్టీగా నారిందని, ఆర్థిక, వ్యాపార బలం ఉన్న వారికే కోటరీ ప్రాధాన్యత ఇస్తుందనే వాదనలను బీవినిపించిన, కొంతమంది పార్టీ నాయకుల,పార్టీ వ్యతిరేకుల ప్రచారాన్ని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే విధంగా భారాస అధినేత కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకొన్నట్లు ప్రజలు గ్రహించలేదు. అదీ కాకుండా, ఇంకా అన్నీ విషయాలలో వారికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు వారి చర్యలు తెలుపుతున్నాయి. పార్టీలో అందరూ వలస నాయకులు వెళ్లిపోయినా, ఉద్యమ కాలంనాటి సహాచారులను అందరినీ కూడదీసుకోవడానికి బదులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి బిజేపితో కలిసి భారాస జప్రాయత్నిస్తుందనే ప్రచాలానికి ఊతమిచ్చే విధంగా వ్యవహరించడంతో, భారాస ను ప్రజలు శంకిస్తున్నారు. ప్రభుత్వం ఉంటే ఏమిటి, కూలితే ఏమిటి? తిరిగి అధికారంలోకి రావడానికి, అననికంటే ముందు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం గౌరవప్రదమైన సీట్లను గెలవడానికి కృషి చేయాల్సిన పార్టీ, ఇంకా మీనా మేషాలు లెక్కించడం, గతంలో చేసిన తప్పులే మళ్ళీమల్లి చేయడంతో, ఒక విధంగా ప్రజలు విసిగిపోయారు.



బిజేపి పార్టీకి ఏవిధంగా సహకరించినా, అది ఆయా పార్టీలకు ఆత్మహత్యాసదృశ్యం అయిందనేది చరిత్ర. బిజేపి పార్టీ తన ఉనికిని పెంచుకోవడానికి, తానే ఏకైక పార్టీగా నిలవడానికి ప్రయత్నించడం తప్పు కాదు. ఎవరైనా అదే చేస్తారు. అన్ని రాష్ట్రాలలో తనతో పొత్తుపెట్టుకొన్న చిన్నచిన్న పార్టీల ఉనికిని మాయం చేసిన చరిత్ర బిజేపి పార్టీది. ఈ వాస్తవాన్నికాదని, కాంగ్రెస్ పార్టీని నాశనం చేయడానికి బజపకీ పరోక్షంగా సహకరిస్తే, చివరికి నష్టపోయేది భారాస పార్టీ కాదు తెలంగాణలోని ప్రజాలనే వాస్తవాన్ని భారాస గ్రహించాలి. భారాస ఖాళీ చేసిన రాజకీయ స్థానాన్ని ఆక్రమించేది బిజేపి. మొగుడు కొట్టిందని కాకుండా, తోటి కోడలు నవ్విందనే పాత సామెతలా వ్యవహరిసే నష్టం ప్రజాలకే కాదు భారాస ఉనికికే.

**–సిహెచ్ వి ప్రభాకర్ రావు,**
**సీనియర్ జర్నలిస్ట్.**
**9391533339**

**కథల రచయితలకు ఆహ్వానం**

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com




## అత్యాశకు పోతే

ఒక అడవిలో ఒక హంస, ఒక కాకి ఉండేవి. హంస నల్లగా ఉండేది. కాకి తెల్లగా ఉండేది. నల్లగా ఉన్న హంస తన రంగును చూసి ఎప్పుడూ దిగులు పడేది కాదు. కాకి మాత్రం ఎచ్చులు పోతూ "నేను తెల్లగా ఉంటాను.. నా ముందు అందరూ దిగదిడుపే" అని చెప్పుకుంటూ తిరిగేది.

ఒక రోజు హంస అడవిలో పోతూ వుంటే ఒక చెట్టు కింద ఓ ముసలాయన దాహంతో అల్లాడిపోతూ "నీళ్ళు... నీళ్ళు..." అని అంటూ పడి ఉన్నాడు. ఆ ముసలాయన్ని చూసిన హంస దగ్గరలో ఉన్న ఓ కొలను దగ్గరకెళ్ళింది. కొలను పక్కన ఉన్న ఓ చెట్టు ఆకుని కోసి దానిని దొన్నె లాగా చుట్టి కొలను నీటిని తీసుకెళ్ళి ముసలాయనకు తాగించింది.

ఆనీళ్ళు తాగిన ముసలాయన ఓ దివ్య పురుషుడిగా మారి హంసకు ఒక వరం ఇచ్చాడు. "నువ్వు ఫలానా సమయంలో తెల్లగా ఉన్న మేఘాల్ని కళ్ళు మూసుకుని బ్రహ్మను ప్రార్థించుకుంటూ తింటే నీ రంగు తెల్లగా మారుతుంది" అది చెప్పాడు.



ఆ దివ్య పురుషుడు చెప్పిన ముహూర్తం కోసం ఎదురు చూడసాగింది. ఆ ముహూర్తం రానే వచ్చింది. హంస వెళ్ళి తెల్ల మేఘాలను తినింది. హంస తెల్లాగా మారిపోయింది.

తెల్లగా మారిన హంసను విషయం అడిగి తెలుసుకుంది కాకి. తను హంసకన్నా ఇంకా తెల్లగా మారాలి అని అనుకుంది.

కాకి హంస చెప్పిన ముహూర్తంలో మేఘాలను తినడానికి కళ్ళు మూసుకుని బ్రహ్మను ప్రార్థించుకుంటూ తీనే సమయానికి తెల్లని మేఘాలు కదిలి వెళ్ళిపోయి కారు మబ్బులు వచ్చేశాయి. ఇది తెలియని కాకి కారు మబ్బులను తినేసింది.

ఆ కారు మబ్బులను తిన్న కాకి నల్లగా మారిపోయింది.

**దొడ్డి లాస్య, 9వ తరగతి**
**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల**
**మన్నారుపోలూరుజి**
**సూళ్లూరుపేట, తిరుపతి జిల్లా**

**కవులకు గమనిక**

ప్రజా మంటలు

ఇవి ఎన్ని"కల" రోజులు.

కవులు సమాజాన్ని కదిలించాలి. అందుకే,

ప్రజలను చైతన్యవంతం చేసే కవితలను

ఆహ్వానిస్తున్నాం.

మీ కవితలు ఎన్నికల అంశానికే పరిమితమై

సామాజిక అంశాలాను స్పృశిస్తూ,

10-15 లైన్లకు మించకుండా

ఈ కింది ఈమైల్ కు పంపండి.

mantalukathalu@gmail.com

వీటిని ప్రతిరోజు "ప్రజా మంటలు"

తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రచురిస్తాం.

-ఎడిటర్

# వేసవి సెలవుల్లో పిల్లలపై జాగ్రత్త వహించాలి

## మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
పిల్లలకు వేసవి సెలవులు రావడంతో జాగ్రత్తగా మీ ఇంట్లోనే ఉంచు కోవాల్సిందిగా తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి. పట్టణంకు చెందిన ఏడుగురు యువకులు నిన్న మోతె చెరువులో ఈతకెళ్ళి ఒక అబ్బాయి మరణించడం జరిగింది. అలాగే బైపాస్ రోడ్లో బైక్ పై వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనదారుడు ఢీ కొట్టడంతో ఒక అబ్బాయి మరణించడం జరిగింది. కావున తల్లిదండ్రులు మీ పిల్లలను ఈ సెలవుల్లో జాగ్రత్తగా ఉంచుకోవాల్సిందిగా కోరుచున్నాము కంప్యూటర్ క్లాసెస్ గాని కోచింగ్ ఇన్స్టిట్యూట్ లో గాని విద్యపై దృష్టి సాధించేలా చూడాలని, ఉన్నత భవిష్యత్తు ఉన్న పిల్లలగా మీ పిల్లలు రాణించాలంటే మీ చేతుల్లోనే ఉంది. తల్లిదండ్రులు జాగ్రత్తగా మీ బాధ్యతను మీరు నెరవేర్చగలరని చైర్ పర్సన్ జ్యోతి ఆశాభావం వ్యక్తం చేశారు.

# వేసవి తీవ్రవేడి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### రోడ్ల మీద దొరికే చిరుతిండ్లు, రంగు పానీయాలు తీసుకోకూడదు

### జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్



**జగిత్యాల ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
జిల్లాలో ఈఏడాది అత్యంత వేడిగా ఉండే వేసవికి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని – జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. ఏప్రిల్ నుండి జూన్ మధ్య జిల్లాలో చాలా వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని దాని దృష్ట్యా జిల్లా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాలో ఈ ఏడాది అత్యంత వేడిగా ఉండే వేసవి/వడదెబ్బ నుండి జిల్లా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి మరియు డిపిఓ లకు వర్చువల్ ఫోన్ కాన్ఫరెన్స్ లో పలు సూచనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపిన జగిత్యాల జెడ్పీ ఛైర్మెన్ దావ వసంతసురేష్ స్కూల్ విద్యార్థులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనది కాబట్టి ప్రతి పాఠశాలలో ప్రార్థన సమయంలో పిల్లలకు వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించవల్సిందిగా జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. జిల్లాలోని ఆశావర్కర్లు మరియు ఏఎన్ఎం లందరూ వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ వేసవిలో వడదెబ్బ వల్ల ఎక్కువగా ఇబ్బంది పాలవుతారు కనుక వారిని రక్షించే విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు...ప్రతి గ్రామంలో ఎండతీవ్రతకు ఓ ఆర్ఎస్ విశిష్ఠత మరియు వైద్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలసిందిగా జిల్లా వైద్యాదికారి కి ఆదేశించారు. ఉపాధిహామీ పనుల దగ్గర అదేవిధంగా కొనుగోలు కేంద్రాల దగ్గర వారికి అందుబాటులో నీళ్ళు, ఓ ఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని జిల్లా పంచాయితీ ఆధికారి కి ఆదేశించారు. రోడ్ల మీద దొరికే చిరుతిండ్లు, రంగు పానీయాలు తీసుకోకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని అన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ/గ్లూకోజ్ కలిపిన నీరు/ఓరల్ రీ హైడ్రేషన్ మరియు పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు అదేవిధంగా ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకోవాలి సూచించారు. ఈ వేసవిలో జిల్లా ప్రజలందరికీ సేవకులుగా పనిచేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణలో మనవంతు బాధ్యత వహించాలని అన్నారు.




# దామెర, చింతలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ఎల్కతుర్తి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు దామెర, చింతలపల్లి, కేశపూర్ తిమ్మాపూర్, కోతులనడుమ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ ఆధికారి ఎం, రాజ్ కుమార్ మనోహర్ రావు సీనియర్ ఇన్స్పెక్టర్ డిసిఓ ఆఫీస్ హనుమకొండ వారు ప్రారంబించారు. ఈ కార్యక్రమములో ఏఈఓ కల్యాణి, రోజా ఎల్కతుర్తి విశాల సహకార సంఘం సి ఈఓ తిరుపతి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



# క్రేన్ వైర్ తెగిపడి వ్యక్తి మృతి

**మహబూబాబాద్, ఏప్రిల్ 3 (ప్రజామంటలు):**
మహబూబాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. క్రేన్ వైర్ తెగి పూడిక మట్టి మీదపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన నర్సింహులపేట మండలం నరసింహాపురం బంజర గ్రామ పంచాయతీ పరిధిలోని పత్ని తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాలోని ఓ వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా క్రేన్ వైరు తాడు తెగి పూడిక మట్టి మీద గుగులోతు రవి (40 ) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. రవి మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# హుండీలో చేయిపెట్టి దొరికి పోయాడు

### దొంగతనం చేస్తూ పట్టుబడ్డ దొంగ ఉద్యోగి

**కామారెడ్డి, ఏప్రిల్ 3 (ప్రజామంటలు):**
పనిచేస్తున్న గుడిలోనే దొంగతనం చేయాలనుకున్న వ్యక్తి. దురదృష్టవశాత్తు దొరికిపోయాడు. దొంగతనం చేస్తుండగా హుండీలో చెయ్యి ఇరుక్కుపోవడంతో దొరికిపోయాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలో జరిగింది. మండలంలోని రామేశ్వరపల్లిలో ఉన్న మాసుపల్లి పోచమ్మ ఆలయంలో సురేశ్ అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. అతను హుండీలో ఉన్న డబ్బును ఎత్తుకెళ్లాలని దురాలోచన చేశాడు. మంగళవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించాడు. హుండీ పైభాగాన్ని ధ్వంసం చేసి అందులోనుంచి డబ్బును బయటకు తీయడానికి ప్రయత్నించాడు. అయితే చెయ్యి అందులో ఇరుక్కుపోవడంతో తీయడానికి శ్రమించాడు. ఎంతకూ అది బయటకు రాకపోవడంతో అలాగే ఉండిపోయాడు. ఉదయం అతడిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కట్టర్ సహాయంతో హుండీని కత్తిరించి చెయ్యిని బయటకు తీశారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

# పెండింగ్ పాలబిల్లులు చెల్లించాలి

### కోటగిరిలో రైతుల రాస్తారోకో

**నిజామాబాద్, ఏప్రిల్ 3 (ప్రజామంటలు):**
కాంగ్రెస్ ప్రభుత్వం సాలబిల్లులు చెల్లించడం లేదంటూ నిరసన వ్యక్తమవు తున్నది. గత మూడు నెలల నుంచి పాడి రైతులకు విజయ డెయిరీ బిల్లులు చెల్లించడం లేదంటూ నిజామాబాద్ జిల్లాలోని కోటగిరి మండల కేంద్రంలో బోధన్ –బాన్సువాడ రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుబంధంగా నడుస్తున్న విజయ డెయిరీ గతంలో ఎప్పుడు బిల్లులు చెల్లింపు విషయంలో ఇంత జాప్యం జరగలేదన్నారు. సకాలంలో డబ్బులు అందాయని రైతులు గుర్తు చేశారు. నెలనెలా డబ్బులు చెల్లించకపోవడంతో ఈఎంఐలు కట్టుకోవడానికి పాడి బర్ల పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైదులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. బిల్లులు చెల్లించేంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల ఆందోళనతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


# 108 వాహనంలో గర్భిణి డెలివరీ

### సాయం చేసిన సిబ్బంది..తల్లీబిడ్డా క్షేమం

**పెద్దపల్లి,ఏప్రిల్3 (ప్రజామంటలు):**
పురిటినొప్పులతో ఉన్న గర్భిణిని దవాఖానకు తరలిస్తుండగా 108 వాహనంలోనే ప్రసవించింది. 108 సిబ్బంది ఆమెకు ప్రసవంచేసి..తల్లి, బిడ్డను కాపాడారు. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లాలో చోటు చేసుకుంది. ధర్మారం మండలం శాయంపేట గ్రామానికి చెందిన మైస సోనియా(24) పురిటి నొప్పులతో బాధపడుతూ రాత్రి 9గంటలకు మేడారం ప్రభుత్వ దవాఖానలో చేరింది.అక్కడ డెలివరీ కాకపోవడంతో తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. మేడారం నుంచి పెద్దపల్లి జిల్లా మాతా శిశు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లో నొప్పులు అధికమయ్యాయి. వెంటనే 108 సిబ్బంది ఈఆర్సీపీ డాక్టర్ సూచన మేరకు అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. సోనియా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వీరిని పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మాతా శిశు దవాఖానకు తరలించారు. తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు. కాగా, 108 సిబ్బందికి సోనియా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్



**భీమదేవరపల్లి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పై ఆరోపణలు చేస్తూ, పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నదని బిజెపి మండల అధ్యక్షులు పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్ ఆరోపించారు. మండలంలోని ముల్కనూర్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ%ొా%. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రైతంగాన్ని ఆగం చేస్తూ, రెండు లక్షల రుణమాఫీ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. గౌరెల్లి ప్రాజెక్ట్ నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ఊసకోయిల కిషన్, శ్రీరామోజు శ్రీనివాస్, దొంగల వేణు, అయిత సాయి, బొజ్జపురి పృథ్వి, భైరవోని అనిల్, మాద్దుల అజిత్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీసీ జేపీసీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి వేడుకలు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
టీబీసీ, జేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో ఉన్న శివాజీ విగ్రహానికి టీబీసీ జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ.... శివాజీ మహరాజ్ దేశ ప్రజలకు స్ఫూర్తి నిచ్చారని, ఆ మహనీయుడి ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గంగం జలజ, విజయ, విద్యారి జిల్లా అధ్యక్షుడు సాయి, జర్నలిస్ట్ మాకు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తి దొడ్డి కొమురయ్య టీబీసీ జేఏసీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
తెలంగాణలో సాయుధ పోరాటం రావడానికి ,భూమి,భుక్తి,విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమురయ్య వీరమరణమే కారణమని టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో 1వ వార్డులో దొడ్డి కొమురయ్య విగ్రహానికి టీ బీసీ జేఏసీ, కుర్మ సంఘ నాయకుడు దయ్యాల మల్లారెడ్డి, స్థానిక కౌన్సిలర్ కూసరి అనిల్ కుమార్ ల ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ.... నిజాం ఉస్మాన్ అలీ కాలంలో నిజాం అండదండలతో జాగీర్ దారులు,దేశ్ ముఖ్లు,దేశ్ పాండేలు,దొరలు,పెట్రేగి పోయి ప్రజలను విపరీతంగా పీడించేవారన్నారు .ముఖ్యంగా విస్నూర్ దేశ్ ముఖ్ రాం చంద్రారెడ్డి కి ఎదురుతిరిగి ప్రజలకు అండగా పోరాడిన దొడ్డి కొమురయ్య ను 40 మంది దుండగులతో కాల్పులు జరపగా ఆ తుపాకీ కాల్పుల్లో దొడ్డి కొమురయ్య వీర మరణం పొందాడని కొనియాడారు.కొమురయ్య హత్యను నిరసిస్తూ చేసిన ఆందోళనలు తెలంగాణ కొలిమిగా మారి సాయుధ విప్లవం ప్రారంభమైందన్నారు. ప్రపంచ చరిత్రలో దొడ్డి కొమురయ్య సాయుధ పోరాట తొలి వీరుడిగా చిరస్థాయిగా నిలిచాడని కీర్తించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ, విద్యార్థి జిల్లా అధ్యక్షుడు వరద సాయి, పట్టణ మహిళా అధ్యక్షురాలు మొగులోజి విజయ, సీనియర్ జర్నలిస్ట్ మాకు రాజలింగం, టీ బీసీ జేఏసీ సంక్షేమ, యువజన, మహిళా, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అండగా నిలువండి..

### పార్లమెంట్ లో గళం ఎత్తుతా..
### గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం..
### నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎం.పి. అభ్యర్థి ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి



(రాజేష్ బొంగురాల)
**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్ లో బీడి కార్మికులు, టేకేదార్లు, కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిధిగా నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి జీవన్ రెడ్డి హాజరయ్యారు. పలువురు టేకేదార్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీడి టేకేదార్లు మాట్లాడుతూ..
మా సమస్యలు పరిష్కరించండి.. మీ వెంటే ఉంటాం..ఎంపీ గా గెలిపిస్తామని బీడి టేకేదార్ల హామీఇచ్చారు. పీ ఎఫ్ ఉన్న వారికి పెన్షన్ ఇవ్వాలి, జీవన్ రెడ్డి తోనే బీడి టేకేదార్ల సమస్యలు పరిష్కారం అవుతాయి అని అన్నారు.నెలంతా చేసిన కష్టం ఆస్పత్రుల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాస మల్లా రెడ్డి మాట్లాడుతూ.... బీడి కార్మికుల వేతనాలు టెకేదార్ల ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలి.గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాలేదు.ఈఎస్ఐ సేవలు బీడి కార్మికులకు అందడం లేదు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటె జీవన్ రెడ్డి నీ గెలిపించాల్సిన అవసరం ఉంది. బీడి కార్మికులు అనారోగ్యాలకు గురి అవుతున్నారు.అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే జీవన్ రెడ్డినీ గెలిపించుకుంటామని ముక్త కంఠంతో నినదించారు.
కోరుట్ల నియోజక వర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ పని చేసే నాయకుడు జీవన్ రెడ్డిని గెలిపించి పార్లమెంట్ కు పంపించాలి అని, జీవన్ రెడ్డి బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తారు. అందరికీ అందుబాటులో ఉన్న నాయకుడిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ ప్రజలు మార్పు కోరుతున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గంలో జీవన్ రెడ్డి లేని లోటు కనపడుతుంది. ఐదేళ్లు అరవింద్ ప్రజలకు చేసింది ఏమీలేదు. పార్లమెంట్ కు పంపితే దేశంలోనే అభివృద్ధి చేస్తారు. మతం పేరుతో కొంతమంది ప్రజలను విడదీస్తూ ఎన్ని పదవులు నిర్వహించినా నిరాడంబర జీవితం జీవన్ రెడ్డి సాధ్యం.
నేను ఎమ్మెల్యేగా కేవలం జీవన్ రెడ్డి ఆశీస్సులతో గెలిచాను అని మేడిపల్లి సత్యం అన్నారు.
నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తా, స్థానికంగా ఉపాధి కరువై కుటుంబాన్ని వదిలి గల్ఫ్ బాట పడుతున్నారు.
యూపీఏ పాలనలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలని సోనియా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపొందించారు.బీడీ కార్మికుల కష్టాలు తెలిసిన వ్యక్తిని, పార్లమెంట్ కు ఎన్నికైన తర్వాత బీడీ కార్మికులకు గల్ఫ్ కార్మికుల సమస్యలు, బీడి కార్మికుల సమస్యల పై గళ నేత్తుతా అని హామీ ఇచ్చారు. 1996లో జగిత్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 54 వేల మెజారిటీ తో గెలిపించారనీ జీవన్ రెడ్డి గుర్తు చేశారు. అన్ని వర్గాలకు తోడుగా మా సమస్యలు పరిష్కరించండి. మీ వెంటే ఉంటాం. ఎంపీ గా గెలిపిస్తామని బీడి టేకేదార్ల హామీఇచ్చారు. పీ ఎఫ్ ఉన్న వారికి పెన్షన్ ఇవ్వాలి. జీవన్ రెడ్డి తోనే బీడి టేకేదార్ల సమస్యలు పరిష్కారం అవుతాయని, అండగా ఉంటానని అన్నారు. ప్రజలు 42 శాసన సభల గ్రాడ్యుయేట్ ఓటర్లు ఎమ్మెల్సీ గా గెలిపించారు. జీవిత కాలం కాంగ్రెస్ పార్టీ లోనేవుంటు, ప్రజలకు సేవ చేస్త, 2014 కు పూర్వం పీ ఎఫ్ బీడి కార్మికులకు ఉన్న వారికి మాత్రమే ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2014 తర్వాత పీ ఎఫ్ రావడం లేదు. ఆంక్షలు లేకుండా కట్ ఆఫ్ తేదీ తోలగించి బీడి కార్మికులకు అందరికీ పెన్షన్ ఇప్పించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. కమిషన్ ఏజెంట్ ల పేరున వేతనం జమ చేసేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ వస్తున్నాయా లేదా అని అడిగాను,గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు కొనసాగిస్తూ, ఉచిత బస్సు ప్రయాణం కల్పించినం. తెలంగాణ రాష్ట్రంలో ఆడ బిడ్డ ప్రతి నెలా 1000 చొప్పున ఏడాదికి 12000 రాయితీ పొందుతోంది. జగిత్యాలలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుతో బీడి కార్మికులకు మేలు జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వ హక్కుల రక్షణ కోసం కేంద్రానికి, రాష్ట్రానికి అనుసంధాన కర్తగా పని చేస్తా. జగిత్యాల అంటే జీవన్ రెడ్డీ. జీవన్ రెడ్డి అంటే జగిత్యాల అనే విధంగా పార్లమెంట్ లో గళం వినిపించి, సమస్యలు పరిష్కారిస్తాను. మీ సమస్యలు నా సమస్యలుగా భావించి, గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయించి, అండగా నిలుస్తాను అని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీడీ టేకేదార్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల వెంకట్, జిల్లా అధ్యక్షుడు మల్లా రెడ్డి, జువ్వాడి నర్సింగ్ రావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఛైర్పర్సన్ గిరి నాగభూషణం, దేశాయ్, ఎంపీపీ మహేష్, మాజీ జెడ్పీటీసీ మాధవి, సతీష్ రాజ్, కళ్లేపల్లి దుర్గయ్య, ముక్రం, మొయిజొద్దీన్, జలపతి రెడ్డి, బండ శంకర్, కొత్త మోహన్, గుంటి జగదీశ్వర్, పుప్పాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# అంబర చుంబితం.. అంజన్న స్మరణం..

## అవధులు దాటిన భక్తి పారవశ్యం



(రామ కిష్టయ్య సంగన భట్ల)
**ధర్మపురి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
పవిత్ర గోదావరి నదీ తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రం బుధ వారం భక్తి పారశ్యంతో పొంగి పోయింది. క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో చైత్ర పౌర్ణమి హన్మజ్జయంతి జరుపుకుంటున్న నేపథ్యంలో... సుదూర ప్రాంతాల నుండి సనాతన వారసత్వ సాంప్రదా యాచరణలో భాగంగా విచ్చేసిన భక్త, యాత్రిక జనం భగవన్నామ స్మరణలతో, జయజయ ధ్వనాలతో క్షేత్రం ప్రతిధ్వనించింది. ముఖ్యంగా పావు మండల దీక్షాపరులైన హన్మాన్ భక్తుల భక్తి పారవశ్యం అవధులు దాటి అలౌకిక ఆనందాన్ని ఆస్వాదింప జేసింది. ఉదయా త్పూర్వం నుండే దూర ప్రాంతాల నుండి ప్రయివేటు వాహనాలు, బస్సులలో క్షేత్రానికి చేరుకున్న భక్తులు, పవిత్ర గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించి, ప్రధానాలయాల ముందు బారులు తీరి వేచి ఉండి దైవ దర్శనాలు చేసు కున్నారు. విశేషించి దేవస్థానం లోని ప్రసన్నాంజనేయ మందిర ప్రాంగణాన నిర్వహి చిన ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఒద్దిపర్తి నర్సింహమూర్తి, కళ్యాణ్ ఆధ్వర్యంలో హన్మాన్ భక్తులు దైవాశీస్సులు పొందారు. ఇది వరకే దీక్ష బూనిన, స్వీకరించిన హన్మాన్ దీక్షాపరులైన భక్తులతో ఆంజనేయ ఆలయం కిటకిట లాడింది. ఇటీవలి కాలంలో ధర్మపురి దేవస్థానంలో సాంప్రదాయ రీతిలో హన్మాన్ దీక్షలను స్వీకరిస్తున్న క్రమంలో, పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక హన్మాన్ మండల దీక్షలను స్వీకరించిన భక్తులు ఉదయాత్పూర్వంనుండి పవిత్ర గోదా వరి నదిలో మంగళ స్నానాలను ఆచరించి, పునీతులై, శ్రీలక్ష్మీ నరసింహ దేవస్థానాంతర్గత ప్రసన్నాంజనేయ ఆలయం ముందు దైవదర్శనార్థం బారులుతీరి వేచి ఉన్నారు. భక్తులకు దేవస్థాన ఈఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, అర్చకులు నరసింహ మూర్తి, కళ్యాణ్ ఆధ్వర్యంలో అంజనీ తనయునికి ప్రత్యేక అభిషేకాలు, నిత్యవిధి పూజలు, అర్చనలు గావించారు. వంద లాది మంది హన్మాన్ దీక్షాపరులైన భక్తులు ప్రత్యేక దైవ పూజాదులలో భాగస్వాములైనారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రవీందర్, సభ్యులు పర్యవేక్షించారు.

# బిఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చిన ఎంపీపీ సమ్మిరెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున్



**వేలేర్ ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
వేలేరు మండలం లోని బి ఆర్ఎస్ పార్టీ ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరేడ్డి మాజీ సర్పంచ్ మల్లికార్జున్ మరియు ముఖ్య నాయకులు కలిసి స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ని వారి నివాసంలో కలిసి పూలబొకే ఇచ్చి మీతోనే మా ప్రయాణం అని ఎమ్మెల్యే పార్టీ మారటం మీద సంపూర్ణ మద్దతును తెలియజేసారు. వారితో పాటు బైరి శ్రీనివాస్, అశోక్, కుమార్, మరియు మండల ముఖ్య నాయకులు కడియం ను కలవటం జరిగింది.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**చిగురుమామిడి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
టి -సెర్ప్ ఆధ్వర్యంలో బొమ్మనపల్లి, ఇందుర్తి గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామ సంఘం అధ్యక్షురాల్లు కాంపెల్లి అరుణ, నిడిగొండ రజని ప్రారంభించారు. జరిగింది. వీరు మాట్లాడుతూ%శా%. ధాన్యం ఆరబెట్టి తాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వ మద్దతు ధర "ఎ" గ్రేడ్ క్వింటాలు రూ. 2203లు కామన్ గ్రేడ్లు రూ. 2183 పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసిలు వెంకటమల్లు, వెంకటేశ్వర్లు,సంపత్ ఆయాగ్రామాల కమిటీ సభ్యులు, వి.ఓ.ఏ. లు కత్తి లావణ్య, టాక్టర్ యూనియన్ అధ్యక్షులు కాంతల శ్రీనివాస్ రెడ్డి, హమాలీలు, రైతులు, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కడియం ను కలిసిన ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న

## డా. కావ్యకు సంపూర్ణ మద్దతు ప్రకటన



**వేలేర్ ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య ని ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకులు హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య కి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య కే ఎం.ఆర్.పి.ఎస్. పూర్తి మద్దత్తు ఉంటుందని ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న, గౌరవ అధ్యక్షులు సంద్రపల్లి వెంకన్న ప్రకటించారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికలలో మాదిగల సంపూర్ణ మద్దత్తు డాక్టర్ కడియం కావ్య కే ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాసి మోహన్, ఉపాధ్యక్షుడు కొమ్మగాని దాసు, అధికార ప్రతినిధి కొమ్ముల బిక్షపతి, వరంగల్ తూర్పు ఇంచార్జ్ వక్కల కుమార్, రాష్ట్ర నాయకులు మిట్టపల్లి కొమురయ్య, జిల్లా నాయకులు నమిండ్ల కలిమెంట్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొంగర మహాలక్ష్మి, చిర్ర ఎలీషా, చిర్ర వెంకటమ్మ, యాదల్ల ఆనందం, కాగిత ప్రసాద్, చింత జోసెఫ్, బాలస్వామి, వెంకటస్వామి, ఎం.ఆర్.పి.ఎస్. నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అంజన్న దీక్ష స్వాముల మహా పాదయాత్ర

## జగిత్యాల నుండి భద్రాచలం



**జగిత్యాల ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
జగిత్యాల (పురాణిపేట్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం) నుండి భద్రాచలం సీతారామచంద్ర స్వాముల వారి దర్శనానికి బయలు దేరిన అంజన్న దీక్షా స్వాముల మహా పాదయాత్ర. లోక కళ్యాణార్థం అంజన్న దీక్షా స్వాములు చేప్పట్టిన ఈ మహాపాద యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకొని సీతరామచంద్ర స్వామి దివ్య దర్శనం గావించాలని భగవంతుని ఆశీశులు మనందరి మీద ఉండాలని కోరుకుంటూ.... జై శ్రీ రామ్ జై హనుమాన్...

# ముఖ్యమైన కూడళ్ళలో చలివేంద్రాలను ఏర్పాటు చెయాలి



**జగిత్యాల ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
ఎండల తీవ్రత చాల ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలకు తాగునీరు అన్ని ప్రాంతాలలో అందుబాటులో లేనందున వేర్వేరు ప్రాంతాల నుండి మన పట్టణానికి ఎన్నో కారణాలతో వస్తున్న దృష్ట్యా నీరు అందరు కొనుక్కునే త్రాగే పరిస్థితి ఉండదు కావున మన జగిత్యాల మున్సిపల్ పక్షాన చౌరస్తాలలో, ముఖ్యమైన కూడళ్ళు అయిన మున్సిపాలిటీ ముందు, చౌరస్తా, న్యూ బస్టాండ్, తీన్ ఖని చౌరస్తా, టవర్, మంచినీళ్ళ బావి, అన్న పూర్ణ చౌరస్తా, ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పురపాలక సంఘం కమీషనర్ ను జగిత్యాల 35 వ వార్డ్ కౌన్సిలర్, హనుమండ్ల జయశ్రీ కోరారు.

# డబుల్ రోడ్డు వేశారు కానీ సెంట్రల్ లైటింగ్ లేవు?

## మురికి కాలువలు లేక విష జ్వరాలతో గ్రామస్తుల ఇబ్బంది




**వేలేర్ ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
వేలేరు మండల కేంద్రంలోని ధర్మసాగర్ మండలం సాయి పేట్ క్లాసు వద్ద నుంచి వేలేర్ మండల ఆఫీస్ వరకు ఖమ్మం నల్గొండ వరంగల్ ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో సుమారు 40 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు కోసం నిధులు మంజూరు చేపించారు. బీటీ రోడ్డు పనులు మరియు సిసి రోడ్డు పనులు పూర్తి చేశారు కానీ మండల హెడ్ క్వార్టర్ లో సెంట్రల్ లైటింగ్ మురికి కాలువలు నిర్మాణం చేయకపోవడంతో మురికి నీరు ఎక్కడిది అక్కడే ఆగిపోయి విష జ్వరాలొచ్చి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సెంటర్ లైటింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని జనరల్ బాడీ మీటింగ్ లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు హెచ్చరించిన ఇంతవరకు అధికారులు పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వేలేర్ ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
వేలేర్ మండలంలోని మాల్లికుదుర్ల, పీచర, కన్నారం, వేలేర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న. ఏపీఎం జయసుధ మాట్లాడుతూ.... రైతులకు మద్దతు ధర రూ. 2203 రైతులు ధాన్యం ఎండబెట్టుకొని తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిసి అశోక్ నిత్యానందం సిఏలు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో వివి ప్యాట్ల రాండమైజేషన్

## కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా




**జగిత్యాల ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
ఈవిఎం, వివిప్యాట్ ల మొదటి ర్యాండ మైజేషన్ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారిణి, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. బుధవారం రోజున కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సహాయ రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిదుల సమక్షంలో ఈవీఎం, వివి ప్యాట్ ల మొదటి ర్యాడమైజేషన్ నిర్వహించారు. రానున్న లోకసభ ఎన్నికల దృష్ట్యా ఎలక్ట్రానిక్ యంత్రాలు, వివిప్యాట్ లను జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజక వర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. కోరుట్ల నియోజక వర్గానికి 327 బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, జగిత్యాలకు 317, ధర్మపురి కి 336 యూనిట్లను కేటాయించామని, అదేవిధంగా కోరుట్ల కి 366 వివి ప్యాట్ లను, జగిత్యాలకు 355, ధర్మపురికి 376 కేటాయించడం జరిగిందని తెలిపారు. త్వరలో ఆయా నియోజక వర్గాలకు పంపించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం పూర్తి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రతులను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, పి. రాంబాబు, ఆర్డీఓ లు మధుసూదన్, ఆనంద్ కుమార్, సంబంధిత తహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోక్సో ఆక్ట్, గంజాయి వల్ల కలిగే నష్టాలు, సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

**జగిత్యాల ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
పోక్సో ఆక్ట్, వివిధ చట్టాలు, గంజాయి వలన కలిగే దుష్పరిణామాల గురించి, సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే విధంగా పోలీస్ కళాబృందం పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. ఈరోజు జిల్లా న్యాయస్థానంలో పోలీస్ కళాబృందం సభ్యులు జిల్లా జడ్జి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.... న్యాయవ్యవస్థలో ఉన్న చట్టాల గురించి ప్రజలకు అవగాహన పరచాలని అదేవిధంగా పోలీస్ చట్టాలు, పోక్సో ఆక్ట్, గంజాయి సేవించడం వల్ల జరిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించే విధంగా చూడాలని కళ బృందం సభ్యులకు సూచించారు.



# నవోదయలో సీటు సాధించిన విద్యార్థి 'కార్తిక్'

## సన్మానించిన ఎమ్మెల్యే సంజయ్



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామనికీ చెందిన విధ్యర్థి కుమ్మరిపెల్లి కార్తిక్ న్యూ విజన్ పాఠశాల లో 5వ తరగతి చదువుతూ అదే పాఠశాలలో నవోదయ కోచింగ్ తీసుకుని నవోదయ పరీక్ష రాసి సీటు సాదిచినందుకు బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కార్తిక్ ను శాలువా తో సన్మానించి, పుస్తకాలు అందచేశారు.అనంతరం న్యువిజన్ స్కూల్ యాజమాన్యం ను అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుమ్మల తిరుపతి, నాయకులు సున్నం సత్యం, ఉపాధ్యాయులు అకు రాజేంధర్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి తీవ్రత దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## డిఆర్డిఓ శ్రీనివాసరావు




**భీమదేవరపల్లి ఏప్రిల్ 03 (ప్రజామంటలు):**
మండలంలోని వంగర పిహెచ్సిని హనుమకొండ జిల్లా అడిషనల్ డి.ఆర్.డి.ఓ. శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. వంగర వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల గురించి హర్షం వ్యక్తంచేశారు. అన్ని గ్రామాల్లో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్స్ ప్రజలకి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో వీరేశం, డాక్టర్ రెహమాన్, డాక్టర్ రుబీనా, కే.ఎల్.ఎన్ స్వామి, ఆరోగ్య విస్తరణ అధికారి సుజన, మౌనిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్‌లో త్రిముఖ పోటీ

### రాహుల్‌కు గట్టి పోటీనిస్తున్న సిపిఐ, బిజెపి

### సిపి నుంచి అన్నీ రాజా..బిజెపి నుంచి సురేంద్రన్ పోటీ





**తిరువనంతపురం, ఏప్రిల్ 3 (ప్రజా మంటలు):** కేరళలోని వయనాడ్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్శిస్తోంది. ఇక్కడ రాహుల్ వరుసగా రెండోసారి పోటీ చేస్తుండగా, ఆయనపై కేరళ బిజెపి అధ్యక్షుడు కె. సురేంద్రన్ పోటీకి దిగారు. మరోవైపు సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా భార్య అన్నీరాజా కూడా పోటీలో ఉన్నారు. దీంతో ముక్కోణపు పోటీ అనివార్యమయ్యింది. దేశమంతా కమ్యూనిస్టులు ఇండియా కూటమిలో ఉన్నా..ఇక్కడ మాత్రం కాంగ్రెస్‌తో పోరాడుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో అమేథీకి బీటలువారిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్మించుకుంటున్న కొత్త కోట వాయనాడ్. గత సార్వత్రిక ఎన్నికల్లో అమేథీలో ఆయన కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే వయనాడ్‌లో మాత్రం 4.31 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన ఈ నియోజకవర్గం నుంచే ఈసారి మళ్లీ పోటీ చేస్తున్నారు. రెండవ విడతలో భాగంగా ఏప్రిల్ 26న పోలింగ్ జరగనున్న ఈ స్థానం కోసం బుధవారం 3వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. దశాబ్దాలుగా పార్టీకి కంచుకోటగా నిలిచిన అమేథీని వదులుకుని మరీ ఈ ఒక్క చోట నుంచే పోటీ చేస్తుండడంతో రాజకీయ ప్రత్యర్థులు సైతం ఈ సీటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వాయనాడ్‌ను కూడా మరో అమేథీలా మార్చి రాహుల్ గాంధీ విజయావకాశాలను దెబ్బతీయాలని చూస్తున్నారు. పైగా దేశమంతటా మిత్రపక్షంగా ఉన్న కమ్యూనిస్టులు ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బద్ధ విరోధులుగా ఉన్నారు. ఇప్పుడు కొత్తగా భారతీయ జనతా పార్టీ సైతం గట్టి పోటీ ఇచ్చేందుకు పావులు కదుపుతోంది. దీంతో ఈసారి గెలుపు సునాయాసం కాదని, గెలవాలంటే కష్టపడాల్సిందేనని వాయనాడ్ సంకేతాలు పంపుతోంది. అమేథీలో పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నాయని ముందే గ్రహించారో.. లేక తన పోటీ కారణంగా కేరళలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలు మరింత పెంచవచ్చని భావించారో తెలియదు కానీ రాహుల్ గాంధీ

2019లో వాయనాడ్ నుంచి బరిలోకి దిగారు. కేరళలో ఎన్నో సీట్లు ఉండగా ఈ స్థానాన్నే ఎంచుకోడానికి కారణాల్లో కాంగ్రెస్ గెలుపొందుతూ రావడం ఒకటి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో వాయనాడ్ కొత్తగా ఏర్పడింది. అప్పటి నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. 2009లో ఎంఐ శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి సీపీఐ నేత ఎం. రహమతుల్లాపై భారీ మెజారిటీతో గెలుపొందారు. అప్పుడు ఇద్దరి మధ్య వ్యత్యాసం 1.53 లక్షలు.. 2014కు వచ్చేసరికి అది కేవలం 20 వేల మెజారిటీకి పడిపోయింది. అప్పుడు కూడా సమీప ప్రత్యర్థి సీపీఐ అయినప్పటికీ.. అభ్యర్థిగా సత్యన్ మోకేరి ఉన్నారు. 2019లో రాహుల్ గాంధీ పోటీ చేయడంతో కాంగ్రెస్ మళ్లీ ఒక్కసారిగా పుంజుకుంది. రాహుల్ గాంధీ 64.94శాతం ఓట్లు సాధించగా తన సమీప ప్రత్యర్థి సీపీఐ నేత పీపీ సునీర్ కేవలం 25.24శాతం ఓట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అంటే దాదాపు 40శాతం ఓట్ల వ్యత్యాసంతో రాహుల్ గాంధీ గెలుపొందారు.

ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రతి ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇస్తున్నది కమ్యూనిస్టులే. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ పేరుతో కమ్యూనిస్టుల సారథ్యంలోని కూటమి తరఫున సీపీఐ పోటీ పడుతూ వచ్చింది. ప్రతిసారీ అభ్యర్థిని మార్చుతూ వచ్చిన సీపీఐ ఈసారి ఏకంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా సతీమణి 'అన్నీరాజా'ను బరిలోకి దించింది. దేశమంతటా విపక్ష కూటమిలో భాగంగా పొత్తులున్నా.. కేరళలో మాత్రం కాంగ్రెస్, కమ్యూనిస్టులు తలపడుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ రెండు పార్టీల మధ్య వైరం కూడా ఉంది. పైగా జాతీయ ప్రధాన కార్యదర్శి సతీమణి కాబట్టి సీపీఐ కార్యకర్తలు కూడా మరింత కష్టపడి పనిచేస్తున్నారు. కాంగ్రెస్ వరుసగా గెలుపొందుతూ రావడం, కాంగ్రెస్ అగ్రనేతగా ఉన్న రాహుల్ గాంధీయే సిట్టింగ్ ఎంపీగా ఉండడం ఆ పార్టీకి అనుకూలాంశాలు అయినప్పటికీ.. సీపీఐ ఎత్తుగడ కచ్చితంగా రాహుల్ గాంధీకి ప్రతికూలంగానే మారుతుంది. రాహుల్‌ను అన్నీరాజా ఓడించగలరా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేకపోయినా.. గట్టి పోటీని ఎదుర్కోక తప్పదన్న సంకేతాలు ఉన్నాయి.

గత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 303 సీట్లు సాధించినప్పటికీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయిన రాష్ట్రాల్లో కేరళ ఒకటి. ఈసారి ఎలాగైనా ఖాతా తెరవాల్సిందేనన్న పట్టుదలతో ఆ పార్టీ నాయకత్వం, శ్రేణులు కేరళ అంతటా పనిచేస్తున్నాయి. ఆ క్రమంలో వాయనాడ్ స్థానాన్ని సైతం భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకం గా తీసుకుంది. గాంధీ కుటుంబాన్ని ఓడించడం అసాధ్యం అనుకున్న అమేథీలోనే రాహుల్ గాంధీని ఓడించిన ఘనతను సొంతం చేసుకున్న ఆ పార్టీ.. రాహుల్‌ను ఢీకొట్టేందుకు తమ కేరళ అధ్యక్షుడు కే. సురేంద్రన్‌ను ప్రయోగిస్తోంది. వాయనాడ్ నుంచి సురేంద్రన్‌ను బరిలోకి దించింది. ఈసారి బీజేపీ రాష్ట్రాధ్యక్షుడే బరిలో ఉన్నందున పార్టీ నేతలు కూడా మరింత ఉత్సాహంతో పనిచేస్తున్నారు. వీటన్నింటికీ తోడు కాషాయదళ అగ్రనాయకత్వం రాహుల్‌పై స్మృతి అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తున్నారు. అమేథీలో రాహుల్‌ను మట్టికరిపించిన ఘనత సొంతం చేసుకున్న కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని వాయనాడ్‌లో ప్రచారాస్త్రంగా సంధిస్తున్నారు. ఈసారి కూడా తనకే గెలుపు అన్న నమ్మకాన్ని రాహుల్ గాంధీకే కల్పించగలిగారు. అందుకే ఆయన అమేథీ నుంచి తప్పుకుని కేవలం వాయనాడ్‌కు పరిమితమయ్యారు. అమేథీ అనుభవాలతో వాయనాడ్‌లో ప్రజలకు దగ్గరయ్యేందుకు అటు రాష్ట్ర శాఖతో పాటు జాతీయ నాయకత్వం కూడా ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగానే రాహుల్ గాంధీపై పదునైన విమర్శలతో స్మృతి ఇరానీని రంగంలోకి దింపింది. అలాగే బిజెపి శ్రేణులు ఇక్కడే ఎక్కువగా దృష్టి సారించారు. దీంతో వయనాడ్ ప్రత్యేకతను సంతరించుకుంది.

## వేసవిలో మళ్లీ మొదలైన
# ప్రైవేట్ టీచర్ల వెట్టి

**అడ్మిషన్లు తేవాలని యాజమాన్యాల ఒత్తిడి**

**ప్రైవేట్ పాఠశాలల టీచర్ల యూనియన్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (ప్రజా మంటలు):** రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో విద్యారంగ పటిష్టతకు పాటుపడుతూ సామాజిక సేవ చేస్తున్న ప్రైవేట్ టీచర్లను కార్మికులుగా గుర్తించి వారికి పెన్షన్,పిఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని, వారిని కార్మికులగా గుర్తించాలని ప్రైవేట్ పాఠశాలల టీచర్ల యూనియన్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ అన్నారు. ఇప్పుటు ప్రైవేట్ టీచర్లు అనేక వృత్తిగతమైన ఇబ్బందులు ఎదుర్కొటున్నారని అన్నారు. ఈ క్రమంలో మళ్లీ విద్యావ్యాపారం మొదలయ్యిందన్నారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే పెద్ద బాధ్యతను మోస్తున్న ప్రైవేట్ టీచర్లు అంతకుమించిన సమస్యలనూ భరిస్తున్నారు. పనిగంటలు పెంచి, ఇతర పనులను కూడా విధుల్లో చేర్చి ప్రైవేట్ టీచర్లను తీవ్ర ఇబ్బంది లకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా వేసవిసెలవుల్లోనూ విధులు నిర్వహించాలని యాజమాన్యాలు హుకూం జారీ చేస్తున్న తీరు తమను వెట్టి కార్మికులుగా చేస్తోందని అన్నారు. టీచర్లనే సేల్స్ మ్యాన్‌లను చేస్తూ ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ టీచర్లకు నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన సెలవుల్లోనూ వివక్ష చూపుతున్నాయి వేసవి సెలవులను సైతం యాజమాన్యాలు సరిగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి సెలవుల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచే పనిని కూడా టీచర్లకే అప్పజెప్పడం దారుణం అన్నారు. వేసవిలో జీతాలుకూడా ఇవ్వడం లేదన్నారు. ధైర్యం చేసి ఏ టీచరైనా ప్రశ్నిస్తే ప్రైవేట్ అంటే ఇలానే ఉంటుందని, ఉంటే ఉండండి లేకుంటే వెళ్లిపోండని హుకూం జారీ చేస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ టీచర్లు తెలంగాణ రాష్ట్రంలో 3 లక్షల మందికి పైగా ఉన్నారని దాదాపు తెలంగాణలోని 90 శాతం మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వీరిపై ఉందన్నారు. ఉద్యోగం ఉండాలంటే ఇవన్నీ చేయాలని యాజమాన్యాలు ఆదేశాలు జారీ చేస్తున్నాయి. దీంతో తప్పని పరిస్థితిలో ప్రైవేట్ టీచర్లు అన్ని పనులు చేయాల్సి వస్తుందన్నారు. ప్రైవేట్ టీచర్ల ఉద్యోగ భద్రత గాలిలో దీపం లాంటిదని, ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఊడిగం చేస్తున్న ఉద్యోగభద్రత లేదన్నారు. దీంతో అభద్రతా భావంతో ప్రైవేట్ టీచర్ కొట్టుమిట్టాడుతున్నాడు. అసలే అర కొర జీతాలు ఇస్తూ, మరోవైపు అన్ని పనులు నెత్తిన వేస్తూ ఎదురు చెప్పితే ఉద్యోగాలు ఉండవని యాజమాన్యాలు బ్లాక్‌మేల్ చేస్తున్నాయని పలువురు ప్రైవేట్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠాలు చెబుతూ, ఇతర రాత పనులు చేస్తూ క్లర్క్‌గా, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు క్యాన్వాసింగ్ కూడా చేస్తూ ప్రచారకర్తలుగా పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పనుల ఒత్తిడిలో అసలు పని బోధన చేయలేక పోతున్నామని ప్రైవేట్ టీచర్లు వాపోతున్నారు. వేల రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివిధ ఫీజుల పేరుతో యాజమాన్యాలు వసూళ్లు చేస్తూ ఖజానా నింపుకుంటున్నాయి. పాఠశాల ఆస్తులను పెంచుకుంటున్నాయి. కాని అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తమ సమస్యలను గతంలో అనేకసందర్భాల్లో అధికారులకు, మంత్రులకు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా మహిళా టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల సాధారణ సమయాలతో పాటు ప్రత్యేక తరగతుల పేరుతో గంటల కొద్దీ క్లాసులు ఏర్పాటు చేయడంతో మహిళా ఉపాధ్యాయులు శారీరక సమస్యలకు గురవుతున్నారు. పి.ఎఫ్, వైద్య, ఇతర సదుపాయాల నిమిత్తం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యలపై ఆయన సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చిన అమలు కావడం లేదని అన్నారు.

## ఆమె మాటలు నాకు వెయ్యేనుగుల బలం

### సావిత్రిపై పుస్తకావిష్కరణలో చిరంజీవి



భవిష్యత్తులో మంచి నటుడివి అవుతావు' అని మెచ్చుకున్న నటి సావిత్రి మాట నాకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని అగ్రనటుడు చిరంజీవి అన్నారు. మహానటి సావిత్రి సినీ ప్రస్థానంపై సంజయ్ కిషోర్ రచించిన పుస్తకం 'సావిత్రి క్లాసిక్స్' అగ్ర కథానాయకుడు చిరంజీవి మంగళవారం సాయంత్రం దీనిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమెతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సావిత్రమ్మ గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. ఆమెతో మంచి అనుబంధం ఉన్నందుకు గర్వపడుతున్నాను. 'పునాదిరాళ్లు'లో నాకు అవకాశం కాకతాళీయంగా వచ్చింది. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు పూర్తి కాకుండానే నటించా. ఆ సినిమా కోసం రాజమండ్రి వెళ్తున్నప్పుడు.. నువ్వు సావిత్రమ్మ సినిమాలో నటిస్తున్నావని చెప్పడంతో సంతోషపడ్డాను. చిత్రీకరణకు ముందు ఆమెను చూశాను. ఓసారి నేను డ్యాన్స్ చేస్తూ కిందపడ్డా. అయినా సరే ఆపలేదు. అది చూసిన ఆమె.. కొన్నేళ్ల తర్వాత 'ప్రేమ తరంగాలు' కోసం పనిచేశాం. ఆమె నాకు తల్లిగా నటించారు. ఆ తర్వాత ఆమెతో నటించే అవకాశం రాలేదు. కళ్లతోనే హావభావాలు పలికించే గొప్ప నటి. ప్రపంచంలో ఆమెలా మరెవ్వరూ చేయలేరు. మా నాన్న అభిమాన నటి. అనుక్షణం ఆమెను ఆరాధిస్తుంటా'అని చిరంజీవి అన్నారు. అనంతరం సావిత్రి కుమార్తె చాముండేశ్వరి మాట్లాడుతూ.. 'చిరంజీవి నాకు అన్నలాంటి వ్యక్తి. అమ్మకు ఒక పెద్ద కొడుకు ఉంటే ఏం చేస్తారో ఈరోజు ఆయన అదే చేశారు. పుస్తకావిష్కరణ నిమిత్తం కొన్ని రోజుల క్రితం ఇంటికి వెళ్లి ఆయన్ని కలిశా. ఆయన ఇంట్లోనే పుస్తకం విడుదల చేద్దామని చెప్పా. కానీ, ఆయన మాత్రం ఫంక్షన్ చేయాలని ఎ÷–లాన్ చేశారు. ఇంతమంది సమక్షంలో దీనిని విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. ఇదే కార్యక్రమంలో చిరంజీవి సతీమణి సురేఖ పాల్గొన్నారు. సురేఖ అడిగిన పలు ప్రశ్నలకు చాముండేశ్వరి సమాధానమిచ్చారు. అమ్మ జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పటికే పలు చిత్రాలు, పుస్తకాలు వచ్చాయి. 'మహానటి' గొప్ప విజయాన్ని అందుకుంది. నేటితరం యువత కూడా అమ్మ గురించి గొప్పగా చెబుతున్నారంటే ఆ సినిమా వల్లే సాధ్యమైంది. అమ్మ బాల్యం, సినిమా కెరీర్, సేవలు, మరణం ఇలా అన్నీ చూపించారు. ఆమె ఫిల్మోగ్రఫీపై ఒక పుస్తకం ఉండాలని భావించా. అలా వచ్చిందే ఈ పుస్తకం. ఇందులో కేవలం ఆమె యాక్టింగ్‌కు సంబంధించిన విషయాలు మాత్రమే ఉంటాయని అన్నారు.

## గీతాంజలి మళ్లీ వచ్చింది..ట్రైలర్ విడుదల

తెలుగు హీరోయిన్ అంజలి టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం గీతాంజలి మళ్లీ వచ్చింది . 2014లో కామెడీ అండ్ హార్రర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'గీతాంజలి' సినిమాకు ఈ చిత్రం సీక్వెల్‌గా రాబోతుంది. ఇక ఈ సినిమాలో శ్రీనివాస్ రెడ్డి కథనాయకుడిగా నటిస్తుండగా.. సత్యం రాజేశ్, షకలక శంకర్, అలీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కోన వెంకట్ కథ, స్క్రీన్ ప్లేను అందిస్తుండగా.. శివ తుర్లపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు.. ఫస్ట్ సింగిల్ విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే తాజాగా మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ గమనిస్తే.. మొదటి పార్ట్‌లో లాగానే ఈ సినిమాలో కూడా శ్రీనివాస్ రెడ్డి దర్శకుడిగా నటిస్తుండగా.. హార్రర్ సినిమా తీద్దామని అంజలి, తన టీమ్‌తో కలిసి ఒక పాడుబడిన భవంతిలోకి వెళతారు. అయితే ఆ భవంతీలో షూటింగ్ జరుగుతుండగా.. వారికి దెయ్యాలు ఉన్నట్లు అనుకొని సంఘటనలు ఎదురవుతుంటాయి. అయితే ఆ ఇంట్లో ఉన్న మూడు దెయ్యాలు ఎక్కడివి.. వారికి ఏం జరిగింది. ఈ క్రమంలోనే అంజలి అండ్ టీమ్ ఏం చేసింది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. కామెడీ అండ్ హార్రర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేశ్, సత్య, షకలక శంకర్, అలీ, బ్రహ్మాజీ, రవి శంకర్, రాహుల్ మాధవ్ ఇతర నటీనటులు కీ రోల్స్ పోషిస్తున్నారు.




## తొలుత సమంతను వద్దనుకున్నా

### రంగస్థలంపై దర్శకుడు సుకుమార్



రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రంగస్థలం' టాలీవుడ్ రికార్డులను ఈ సినిమా తిరగరాసింది. చిట్టిబాబుగా రామ్ చరణ్, రామలక్ష్మిగా సమంత ఇద్దరూ వారి పాత్రల్లో ఒదిగిపోయి ప్రేక్షకులకు వినోదాన్ని పంచారు. అయితే, ఈ చిత్రంలో మొదట సమంతను వద్దనుకున్నారట సుకుమార్. ఎందుకు వద్దనుకున్నారో అప్పట్లో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అలాగే ఆ చిత్రానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను కూడా పంచుకున్నారు. రంగస్థలం'లో చరణ్ అద్భుతంగా నటించాడు. ఆ పాత్రలో అతడిని తప్ప మరొకరిని ఊహించుకోలేం. ఈ విషయం తనతోనూ చాలాసార్లు చెప్పాను. మొదట ఈ చిత్రంలో సమంతను తీసుకోవాలనుకోలేదు. కొత్త అమ్మాయి అయితే బాగుంటుందనుకున్నా. సినిమాలో హీరో, హీరోయిన్ ఇద్దరూ పెద్ద స్టార్స్ అయితే నేను సెట్‌లో మేనేజ్ చేయలేనేమో అనిపించింది. అందుకే రామ్ చరణ్ ఒక్కరు చాలు హీరోయిన్‌గా కొత్త అమ్మాయిని తీసుకుందాం అనుకున్నా. కానీ, సినిమా స్క్రిప్ట్ ప్రకారం మంచి ఆర్టిస్టు, తెలుగు వచ్చిన హీరోయిన్ కావాలి. సమంత అయితే పల్లెటూరి అమ్మాయి పాత్రకు సరిపోతుందని ఆమెను ఎంపిక చేశాను. షూటింగ్ సమయంలో ఆమె నటన చూసి ఆశ్చర్యపోయాను. ప్రతీ సన్నివేశంలో ఆమె పలికించిన హావభావాలు అద్భుతం. అంత బాగా చేసింది.

'ఆ ఆడియో విడుదల కార్యక్రమంలోనూ నేను ఒక్కటే చెప్పా.. నేను సినిమాలు తీసినంతకాలం సమంతను తీసుకుంటూనే ఉంటానన్నా. 30 ఏళ్లు వస్తే ఆ వయసుకు తగ్గపాత్ర.. 40 వస్తే ఆ ఏజ్‌కు సరిపోయే పాత్ర.. ఇలా ఆమెకు ఎప్పుడూ అవకాశమివ్వాలని అనుకున్నాను. ఈ చిత్రంలో లిప్‌లాక్ సీన్ కూడా కథకు అవసరం కాబట్టే పెట్టాం. సినిమాను కళాత్మక దృష్టితో చూడాలి. మరోలా చూడడం పద్ధతి కాదు. సందర్భం వచ్చినప్పుడు ఒక అమ్మాయి.. అబ్బాయి చేయిపట్టుకోవడం ఎంత ముఖ్యమో.. ముద్దు పెట్టుకోవడం కూడా అంతే ముఖ్యం అని చెప్పారు. 2018 మార్చి 30న 'రంగస్థలం' విడుదలైంది. ఇందులో నటించిన అందరికీ మైలురాయిగా నిలిచింది.




## ఎన్టీఆర్‌ను కలుసుకున్న విశ్వక్ సేన్

స్టార్ నటుడు ఎన్టీఆర్‌కు యువ హీరో మాస్‌కా దాస్ విశ్వక్ సేన్ అభిమాని అన్న విషయం తెలిసిందే. తారక్‌కు చిన్నప్పటినుంచే వీరాభిమాని అయిన విశ్వక్ సేన్.. తన సినిమాలతో మాస్ లో మంచి ఇమేజ్ ని సంపాదించుకుంటూ ముందుకు వెళ్తూనే, నందమూరి ఫ్యామిలీ ఆడియన్స్ అభిమానాన్ని కూడా అందుకుంటున్నారు. అయితే తాజాగా ఈ నటుడు ఎన్టీఆర్‌ను కలుసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలను విశ్వక్ సేన్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. ఈ ఫొటోకు 'లవ్ యూ తారక్ అన్న' అంటూ రాసుకొచ్చాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఇక సినిమాల విషయానికి వస్తే.. తారక్ ప్రస్తుతం కొరటల శివ దర్శకత్వంలో దేవర సినిమా చేస్తున్నాడు. రెండు భాగాలుగా తెరకుక్కుతున్న ఈ చిత్రంనుంచి మొదటి పార్ట్ దసరా కానుకగా 2024 అక్టోబర్ 10న విడుదల కానుంది. మరోవైపు విశ్వక్‌సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి అనే సినిమాలో నటిస్తుండగా ఈ చిత్రం ఏప్రిల్ 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

## 200 కోట్లు వసూలు చేసి చూపిస్తా

### ఫ్యామిలీ స్టార్ విజయ్ దేవరకొండ



రెండు వందల కోట్ల రూపాయల కలెక్షన్ సినిమా చేస్తానని చెప్పడం తప్పు కాదు. అలా చెప్పి కొట్టకపోవడం తప్పు. కానీ ఎవరు ఎన్ని అనుకున్నా... రెండు వందల కోట్ల రూపాయల వసూళ్ల సినిమా చేస్తా. ఇది బలుపు, అహంకారం అనుకున్నా సరే.. అని అన్నారు స్టార్ హీరో విజయ్ దేవరకొండ . ఆయన హీరోగా, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా.. సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, టాలెంటెడ్ డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్' 5న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోన్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండతో త్వరలో భారీ పాన్ ఇండియా మూవీ.. దిల్ రాజు ప్లాన్ మాములుగా లేదుగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ. 'ఆరేళ్ల కిందట నా కెరీర్‌లో బి÷–గగెస్ట్ బ్లాక్ బస్టర్ 'గీత గోవిందం' ఇదే డైరెక్టర్‌తో చేశాను. ఆ రోజులు వేరు. కొత్తగా ఇండస్ట్రీకి వచ్చి వరుసగా సూపర్ హిట్స్ ఇస్తున్నాడని నా గురించి మాట్లాడుకున్నారు. నా మొదటి సినిమా 'పెళ్లి చూపులు' టైమ్‌లో మీ గురించి మీరు వినాలని అనుకుంటున్న పెద్ద గాసిప్ ఏంటని అడిగితే.. నా సినిమా వంద కోట్ల రూపాయలు వసూళ్లు చేసినట్లు న్యూస్ చూడాలి అన్నాను. అది నా బి÷–గగెస్ట్ డ్రీమ్ అప్పటికీ. ఆ డ్రీమ్ నా నాలుగో సినిమాకే నిజమైంది. 'గీత గోవిందం' వంద కోట్ల రూపాయల వసూళ్లు చేసింది. ఆ తర్వాత అలాంటి మూవీ నాకు దక్కలేదు. వంద కోట్ల రూపాయల వసూళ్ల సినిమా అందుకోవాలి అని చెప్పిన కుర్రాడు.. తన మరో సినిమా రెండు వందల కోట్ల రూపాయల కలెక్షన్ చేస్తుందని చెప్పాడు. కానీ అందుకోలేకపోయాడు. అలా ఎందుకు స్టేట్ మెంట్ ఇచ్చావు అని నాతో చాలా మంది అన్నారు. నీ వయసు హీరో అలా మాట్లాడితే అహంకారం అనుకుంటారు అని ప్రేమతో నాకు చెప్పిన పెద్దవాళ్లున్నారు. రెండు వందల కోట్ల రూపాయల కలెక్షన్ సినిమా చేస్తానని చెప్పడం తప్పు కాదు. అలా చెప్పి కొట్టకపోవడం తప్పు. కానీ ఎవరు ఎన్ని అనుకున్నా... రెండు వందల కోట్ల రూపాయల వసూళ్ల సినిమా చేస్తా. ఇది బలుపు, అహంకారం అనుకున్నా సరే. కానీ ఇది నా మీద నాకున్న నమ్మకం, విశ్వాసం అని ప్రకటించాడు. 'పెళ్లి చూపులు' నుంచి 'ఫ్యామిలీ స్టార్' వరకు నేను చేసిన ప్రతి సినిమా ఏదో కొత్త విషయాన్ని నేర్పించింది. ఇదొక జర్నీ. ఎన్నో ఇబ్బందులు, ఆటంకాలు, అవమానాలు ఎదురవుతుంటాయి. అవన్నీ దాటుకుని మనం అనుకున్నది సాధించాలి. మనకు మన గోల్ మాత్రమే కనిపించాలి. నేను అలాగే అనుకుంటా. అదే నమ్మకంతో పనిచేస్తుంటా. మీలో చాలా మంది యాక్టర్స్, బిజినెస్ మెన్, డైరెక్టర్స్, కంటెంట్ క్రియేటర్స్.. ఇలా ఏదో ఒకటి సాధించాలని అనుకుంటారు. ఆ కల నెరవేర్చుకునేందుకు ప్రయత్నించండి. నేను నా మొదటి సినిమా ప్రీ రిలీజ్‌లోనే చెప్పాను. తలెత్తుకోండి, హ్యాపీగా ఉండండి.



# సూపర్ మ్యాన్ సూట్‌లో ఇషాన్ కిషన్

ఐపీఎల్ 2024లో ముంబై ఇండియన్స్ ప్రదర్శన నిరాశపరిచింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా సారథ్యంలో ముంబై ఇండియన్స్ జట్టు వరుసగా మూడు మ్యాచుల్లో ఓడిపోయింది. దీంతో ముంబై ఇండియన్స్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతలో, ముంబై ఇండియన్స్ వికెట్ కీపర్ అండ్ స్టార్ బ్యాటర్, ఇషాన్ కిషన్ విచిత్రమైన అవతార్‌లో దర్శనమిచ్చాడు. సూపర్‌మ్యాన్ సూట్ తో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇషాన్ కిషన్ ఇదే డ్రెస్ ధరించి విమానాశ్రయానికి కూడా వెళ్లాడు. అక్కడ అతని డ్రెస్ కోడ్ చూసి అభిమానులు కూడా అయోమయంలో పడ్డారు. అయితే దీని వెనుక కారణం వింటే నవ్వు రాక మానదు. ఇషాన్ కిషన్‌కి ఇలాంటి డ్రెస్ కోడ్ ఇవ్వడానికి గల కారణాన్ని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా తెలిపింది. జట్టు సమావేశాలకు ఆలస్యంగా వచ్చేవారి కోసం ముంబై ఇండియన్స్ ఇలాంటి పనిష్మెంట్ ఇస్తోందట. అందుకే ఇషాన్ కిషన్ కు సూపర్ మ్యాన్ సూట్ ఇచ్చారట. దీనికి సంబంధించిన సమాచారాన్ని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ట్విట్టర్‌లో తెలియజేసింది. ఇషాన్ కిషన్ మాత్రమే కాదు, జట్టులోని మరో ముగ్గురు ఆటగాళ్లకు కూడా ఇదే రకమైన శిక్ష పడింది. స్పిన్నర్లు కుమార్ కార్తికేయ, షామ్స్ ములానీ, శ్రీలంక ఫాస్ట్ బౌలర్ నువాన్ తుషారాలకు కూడా ఇదే డ్రెస్ కోడ్ విధించింది ముంబై ఫ్రాంచైజీ. నలుగురూ సూపర్ మ్యాన్ వేషం వేసుకుని హోటల్ రూమ్ నుంచి బయటకు వచ్చారు. కాగా, ఇషాన్ కిషన్ గత మూడు మ్యాచ్‌ల్లో ఫామ్‌లో లేడు. మూడు మ్యాచ్‌ల్లో 50 పరుగులు మాత్రమే చేశాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఖాతా కూడా తెరవలేకపోయాడు. మరోవైపు, నేహాల్ వదేరా కూడా బ్యాటింగ్ సమావేశానికి ఆలస్యంగా వచ్చారు. కాబట్టి అతనికి ప్యాడ్స్ కట్టుకుని విమానాశ్రయం చుట్టూ తిరిగే శిక్ష విధించారు.

**ముంబై ఇండియన్స్ జట్టు:**
రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), నమన్ ధీర్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, షమ్స్ ములానీ, గెరాల్డ్ కోయెట్జీ, పీయూష్ చావ్లా, జస్‌ప్రీత్ బుమ్రా, క్వెనా మఫాకా, మహ్మద్ నబీ, సూర్యకుమార్ యాదవ్, శ్రేయాస్ గోపాల్, ల్యూక్ వుడ్, విష్ణు వినోద్, అర్జున్ టెండూల్కర్, నేహాల్ వధేరా, కుమార్ కార్తికేయ, శివాలిక్ శర్మ, అన్షుల్ కాంబోజ్, ఆకాష్ మధ్వల్, నువాన్ తుషార, డెవాల్డ్ బ్రూయిస్.

# కేఎల్ రాహుల్ టీమ్‌కు ఎదురు దెబ్బ..




ఐపీఎల్ 2024లో కేఎల్ రాహుల్ కెప్టెన్సీలోని లక్నో సూపర్ జెయింట్స్ నిలకడగా రాణిస్తోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు మ్యాచ్‌లు గెలిచి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. అయితే ధనాధన్ లీగ్ మధ్యలోనే ఆ జట్టుకు పెద్ద షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ శివమ్ మావి మొత్తం లీగ్‌కు దూరమయ్యాడు. పక్కటెముక గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో ఫాస్ట్ బౌలర్ శివమ్ మావి ఐపీఎల్ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఆగస్ట్ 2023 నుంచి ఈ గాయంతో బాధపడుతున్న మావి, లీగ్ ప్రారంభం నాటికి కోలుకుంటాడని భావించారు. అయితే అది సాధ్యం కాలేదు. కాగా గత ఎడిషన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన శివమ్ మావికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఆ తర్వాత మినీ వేలానికి ముందే గుజరాత్ జట్టు నుంచి మావి విడుదలయ్యాడు. అక్కడ లక్నో సూపర్ జెయింట్స్ అతన్నికొనుగోలు చేసింది. మినీ వేలంలో మావిని లక్నో జట్టు రూ. 6.4 కోట్లకు కొనుగోలు చేసింది. అవేష్ ఖాన్ స్థానాన్ని భర్తీ చేసేందుకు లక్నో ఈ మొత్తాన్ని మావిని కొనుగోలు చేసింది. కానీ మావి ఇప్పటి వరకు లక్నో తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. మావి ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడన్న విషయాన్ని లక్నో ఫ్రాంచైజీ మీడియాకు తెలియజేసింది 'గత డిసెంబర్‌లో జరిగిన వేలంలో మా జట్టులో చేరిన ప్రతిభావంతుడైన రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ శివమ్ మావి ఇప్పటివరకు మా జట్టు నిర్వహించిన శిబిరంలో పాల్గొన్నాడు. ఈ సీజన్‌లో అతను జట్టుకు కీలక ఆటగాడిగా మారతాడని భావించాం. అయితే ఇప్పుడు అతడు అందుబాటులో లేకపోవడంతో అందరూ నిరాశ చెందుతున్నాం.

**లక్నో సూపర్‌జెయింట్స్ జట్టు:**
కేఎల్ రాహుల్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్, నికోలస్ పూరన్, ఆయుష్ బదోనీ, కైల్ మేయర్స్, మార్కస్ స్టోయినిస్, దీపక్ హుడా, దేవదత్ పడిక్కల్, రవి బిష్ణోయ్, నవీన్ ఉల్ హక్, కృనాల్ పాండ్యా, యుధ్‌వీర్ సింగ్, ప్రేరా మాన్కా. యశ్ ఠాకూర్, అమిత్ మిశ్రా, షమర్ జోసెఫ్, మయాంక్ యాదవ్, మొహ్సిన్ ఖాన్, కె. గౌతమ్, అర్షిన్ కులకర్ణి, %వీ%. సిద్ధార్థ్, ఆష్టన్ టర్నర్, మాట్ హెన్రీ, మొహమ్మద్ అర్షద్ ఖాన్.

## నా అంతిమ లక్ష్యం అదే

### మయాంక్ యాదవ్



ఎప్పటికైనా భారత జట్టుకు ఆడడమే తమ అంతిమ లక్ష్యం అని యువ ఆటగాడు మయాంక్ యాదవ్ తెలిపాడు. వరుసగా రెండు మ్యాచల్లోనూ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నాడు. ఐపీఎల్ 17వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్న మయాంక్.. అద్భుతంగా రాణిస్తున్నాడు. ఆడిన తొలి మ్యాచ్‌లోనే సంచలన బౌలింగ్‌తో ఆకట్టుకున్న అతడు.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై చెలరేగాడు. 4 ఓవర్లు వేసిన మయాంక్ కేవలం 14 పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు తీశాడు. మయాంక్ యాదవ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. అవార్డు తీసుకున్న అనంతరం మయాంక్ మాట్లాడుతూ%౫ా% 'వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉంది. రెండు మ్యాచుల్లోనూ మా జట్టు గెలిచింది. ఎప్పటికైనా భారత జట్టుకు ఆడడమే నా అంతిమ లక్ష్యం. నా ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించానను కుంటున్నా. కామెరూన్ గ్రీన్ వికెట్‌ను పడగొట్టినందుకు సంతోషించాను. వేగంగా బౌలింగ్ చేయడానికి డైట్, మంచి నిద్ర, శిక్షణ చాలా అవసరం. అలానే చన్నీటి స్నానం, డైట్‌పై నిరంతరం శ్రద్ధ పెడుతున్నాను' అని చెప్పాడు.మయాంక్ యాదవ్ తన సంచలన బౌలింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. గంటకు 150 కి.మీ వేగంతో బంతులు సంధిస్తునాడు. బెంగళూరుపై కూడా గంటకు 150 కి.మీ వేగంతో బంతులేశాడు. ఒక బంతిని ఏకంగా 156.7 కి.మీ వేగంతో వేసి రికార్డు సృష్టించాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా వేసిన బౌలర్ల జాబితాలో మయాంక్ టాప్ 4కి చేరుకున్నాడు. మయాంక్ బౌలింగ్ చూస్తే త్వరలోనే అతడి కల నెరవేరేలా ఉంది.

## సచిన్ ని విమర్శించి మరోసారి అభిమానులకు టార్గెట్ గా మారిన 'పాండ్య'..!



ఈ ఐపీఎల్ 2024 సీజన్ స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యకు అంతగా కలిసి రాలేదు. రెండు విజయవంతమైన సీజన్లు గుజరాత్ టైటాన్స్‌తో ఆడిన పాండ్య.. ఆ తర్వాత., ముంబై ఇండియన్స్ కి కెప్టెన్ గా తిరిగి వచ్చాడు. ఈ ఛాన్సును కొత్త అధ్యయంగా మలుచుకోవడానికి ప్రయత్నించాడు హార్ధిక్ పాండ్య. కాకపోతే ప్రస్తుతం ముంబై ఇండియన్స్ టీం చాలా దారుణంగా ఆడుతోంది. దీంతో కెప్టెన్ గా వ్యవహరిస్తున్న హార్దిక్ పాండ్యా పై మరింత ఒత్తిడి జరిగింది. మొదటినుంచి ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా రోహిత్ శర్మ కాకుండా హార్దిక్ పాండ్యను చేయడం ముంబై ఫ్యాన్స్ అసలు ఒప్పుకోవట్లేదు. ఇప్పుడు వరకు ఈ సీజన్ లో జరిగిన మూడు మ్యాచ్ లలో ముంబై ఇండియన్స్ ఓటమి చూసింది. హార్థిక్ పాండ్య కెప్టెన్ గా ముంబై ఇండియన్స్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ప్రస్తుతం పాయింట్స్ పట్టికలో ముంబై ఇండియన్స్ చివరి స్థానంలో ఉంది. ఈ దెబ్బతో పాండ్య మీద విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఇకపోతే హార్థిక్ పాండ్య కి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియో దెబ్బకి హార్దిక్ పాండ్యని క్రికెట్ ఫ్యాన్స్ మరింతగా రోస్ట్ చేస్తున్నారు. ఈ వీడియోలో హార్దిక్ పాండ్య మ్యాచ్ ప్రారంభానికి ముందు సచిన్ టెండూల్కర్ ను ఇగ్నోర్ చేసినట్లుగా కనబడుతోంది. ఇకపోతే సచిన్ ముంబై ఇండియన్స్ సపోర్ట్ టీంలో ఒక మెంబర్. ఆ వీడియోలో సచిన్ టెండూల్కర్ పిచ్ పై నడుస్తున్న సమయంలో హార్థిక్ పాండే దాని పక్కనే ఉండి ప్రాక్టీస్ చేస్తున్నట్లు కనపడుతోంది. అయితే సచిన్ తో కలిసి కెప్టెన్ గా ఉన్న పాండ్య పిచ్ చూడడానికి కాస్త కూడా ఆసక్తి చూపించకపోవడంతో ఈ వీడియో వైరల్ గా మారింది.అయితే అదే సమయంలో రోహిత్ శర్మ సచిన్ ను గమనించి ఆయన దగ్గరికి వెళ్లి ఆట గురించి చర్చించాడు. ఇక అలాగే సన్ రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ లో కూడా ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ లతీష్ మలింగను కూడా హార్దిక్ పట్టించుకోలేదని ఆరోపణలు గట్టిగా వినపడుతున్నాయి. దీంతో ముంబై ఇండియన్స్ అభిమానులు టీంని గెలిపించడం చేతకాదు కానీ.. ఇలా ఆటిట్యూడ్ చూపించడానికి మాత్రం ముందుంటాడు అంటూ హార్దిక్ పాండ్యాపై ఘాటు విమర్శలకు దిగారు. తన తోటి ప్లేయర్లు అలాగే సీనియర్లపై కనీస మర్యాద చూపించాల్సిందని మరికొందరు హార్దిక్ పాండ్యాపై విమర్శలు చేస్తున్నారు.

## ఐపీఎల్ ప్లేయర్లకు బిగ్ రిలీఫ్ ఇచ్చిన న్యూజిలాండ్

పాకిస్థాన్ టూర్‌లో జరిగే టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్ జట్టును ప్రకటించింది. 33 ఏళ్ల ఆల్‌రౌండర్ మైఖేల్ బ్రేస్‌వెల్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. తొలిసారి కెప్టెన్సీ అందుకున్నాడు. 2024లో పాల్గొనే కారణంగా రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, కేన్ విలియమ్సన్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లరు. ఏప్రిల్ 18 నుంచి ఇరు దేశాల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 జరగనుంది. తొలి మ్యాచ్ రావల్పిండిలో జరగనుంది. మైకేల్ బ్రేస్‌వెల్ గాయం కారణంగా ఏడాది పాటు మైదానానికి దూరంగా ఉన్నాడు. అతని వేలు విరిగిపోయింది. ఇప్పుడు రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ లేకపోవడంతో అతను పాకిస్థాన్ పర్యటనలో జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. విలియమ్సన్ ఐపీఎల్ 2024లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్నాడు. కెప్టెన్సీపై బ్రేస్‌వెల్ మాట్లాడుతూ, ఈ రోజును నేను ఎప్పటికీ మర్చిపోలేను. నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను. న్యూజిలాండ్‌కు మళ్లీ ఎంపికవ్వడంతోపాటు.. కెప్టెన్‌గా సెలక్ట్ కావడం గొప్ప గౌరవం. నేను దీనిని ఊహించలేదంటూ చెప్పుకొచ్చాడు.ఐపీఎల్‌లో పాల్గొంటున్న ట్రెంట్ బౌల్ట్, డెవాన్ కాన్వే, లాకీ ఫెర్గూసన్, మ్యాట్ హెన్రీ, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, మిచెల్ సాంట్నర్, విలియమ్సన్‌లు పాక్ టూర్‌కు వెళ్లరు. న్యూజిలాండ్ టెస్ట్ కెప్టెన్ టిమ్ సౌథీ అన్ని ఫార్మాట్లలో పాల్గొనడం వల్ల విశ్రాంతి తీసుకోగా, విల్ యంగ్, టామ్ లాథమ్, కొలిన్ మున్రో కూడా అందుబాటులో లేరు. పవర్ హిట్టర్ టిమ్ రాబిన్సన్, ఫాస్ట్ బౌలర్ విలియం ఒరూర్క్ కూడా టీ20 జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ ఏడాది ఆరంభంలో స్వదేశంలో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ 4-1తో పాకిస్థాన్‌ను ఓడించింది.

న్యూజిలాండ్ టీ20 జట్టు: మైఖేల్ బ్రేస్‌వెల్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మార్క్ చాప్‌మన్, జోష్ క్లార్క్‌సన్, జాకబ్ డఫీ, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, బెన్ లిస్టర్, కోల్ మెక్‌కాంచీ, ఆడమ్ మిల్నే, జిమ్మీ నీషమ్, విల్ ఒరూర్క్, టిమ్ రాబినిమ్, టిమ్ రాబినిమ్, సీఫెర్ట్, ఇష్ సోధి.

## 2019 ప్రపంచకప్ ఫైనల్‌లో తప్పిదం చేశాం

### ఐసీసీ ఎలైట్ ప్యానెల్ మాజీ అంపైర్ మరియస్ ఎరాస్మస్

2019 ప్రపంచకప్ ఫైనల్‌లో తాము ఘోర తప్పిదం చేసినట్లు ఐసీసీ ఎలైట్ ప్యానెల్ మాజీ అంపైర్ మరియస్ ఎరాస్మస్ తెలిపారు. తమ తప్పిదం వల్లనే ఫైనల్ మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసిందని, అసలు ఇంగ్లండ్ కప్ గెలిచేదే కాదన్నారు. 5 పరుగులకు బదులుగా.. 6 పరుగులు ఇవ్వడంతో మ్యాచ్ టైగా ముగిసిందని ఎరాస్మస్ చెప్పారు. ఫైనల్‌లో భారీ తప్పిదం చేశామని సహచర అంపైర్ కుమార్ ధర్మసేన తనతో మరుసటి చెప్పారని ఎరాస్మస్ వివరించారు. లార్డ్స్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్ బౌండరీల కౌంట్ ఆధారంగా విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ముందుగా మ్యాచ్, ఆపై సూపర్ ఓవర్ కూడా టై అవడంతో.. ఐసీసీ నిబంధనల ప్రకారం బౌండరీల కౌంట్ ఎక్కువగా ఉన్న ఇంగ్లండ్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 241 రన్స్ చేయగా.. ఇంగ్లండ్ కూడా 241 పరుగులే చేసింది. మ్యాచ్ టై అవ్వడంతో.. ఫలితం కోసం సూపర్‌ఓవర్‌ను నిర్వహించారు. సూపర్‌ఓవర్‌లో ముందుగా ఇంగ్లండ్ 15 రన్స్ చేయగా.. ఆపై కివీస్ కూడా 15 పరుగులే చేసింది. ఇంగ్లండ్ విజయానికి 50వ ఓవర్లోని చివరి మూడు బంతులకు 9 పరుగులు అవసరం అయ్యాయి. ట్రెంట్ బౌల్ట్ వేసిన నాలుగో బంతిని బెన్



స్టోక్స్ డీప్ మిడ్ వికెట్ మీదుగా షాట్ ఆడగా.. మార్టిన్ గప్టిల్ బంతిని అందుకొని త్రో విసిరాడు. స్టోక్స్, అదిల్ రషీద్ రెండో పరుగుకు ప్రయత్నించారు. అయితే గప్టిల్ వేసిన త్రో స్టోక్స్ బ్యాటుకు తగిలి బౌండరీకి వెళ్లింది. దీంతో అంపైర్లు ఓవర్ త్రో ద్వారా వచ్చిన నాలుగు, బ్యాటర్లు తీసిన రెండు పరుగులను కలిపి మొత్తంగా ఆరు రన్స్‌ను ఇచ్చారు. చివరి రెండు బంతులకు ఇంగ్లండ్ 2 పరుగులే చేసి స్కోరును సమం చేసింది. ఆ తర్వాత సూపర్ ఓవర్ టై అయింది. ఐసీసీ రూల్స్ ప్రకారం.. ఓవర్ త్రో ద్వారా వచ్చిన పరుగులతో పాటు బ్యాటర్లు తీసిన రన్స్‌ను కూడా బ్యాటింగ్ జట్టుకు ఇస్తారు. అదే సమయంలో ఫీల్డర్ త్రో విసిరే సమయానికి.. పరుగు కోసం ఇద్దరు బ్యాటర్లు క్రీజు దాటినా పరుగు ఇస్తారు. ఈ నిబంధన ప్రకారం.. ఇంగ్లండ్‌కు 5 పరుగులే రావాలి. ఎందుకంటే మార్టిన్ గప్టిల్ త్రో విసిరే సమయానికి బెన్ స్టోక్స్, ఆదిల్ రషీద్ క్రీజును దాటలేదు. ఇది గమనించని ఫీల్డ్ అంపైర్‌లు ఐదుకు బదులుగా ఆరు పరుగులు ఇచ్చారు. అలా ఇవ్వకుంటే మ్యాచ్ టై కాకపోయేది, న్యూజిలాండ్ గెలిచేది.'ఫైనల్ మ్యాచ్ మరుసటి రోజు ఉదయం హోటల్ గదుల నుంచి కుమార ధర్మసేన, నేను ఒకే సమయంలో బయటకి వచ్చాం. మనం పెద్ద తప్పు చేశామని మీరు గమనించారా? అని ధర్మసేన నన్ను అడిగాడు. అప్పుడే ఆ విషయం నాకు తెలిసింది. మైదానంలో ఉన్న ఆ క్షణంలో ఇద్దరం 'ఆరు' 'ఆరు' అని చెప్పుకున్నాం. కానీ బ్యాటర్లు రెండో పరుగు పూర్తి చేయలేదని గమనించలేకపోయాం'అని మరియస్ ఎరాస్మస్ తెలిపారు. ఇటీవలే ఎరాస్మస్ రిటైరైన విషయం తెలిసిందే.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com